J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 25.09.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 17 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerpatrika.com


## ఆధిపత్య పోరులో... ఆ నాలుగు స్తంభాలు

### అస్తవ్యస్తంగా మారుతున్న వ్యవస్థలు

బాధ్యతాయుతంగా మెలిగి సమాజాన్ని సన్మార్గాన నడిపిస్తూ దేశ పురోభివృద్ధికి దోహదం చేయవలసిన ముఖ్య విభాగాలన్నీ ఇప్పుడు ఆధిపత్య పోరులో నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నాయి. లెజిస్లేటివ్, ఎగ్జిక్యూటివ్, జ్యుడిషియరీ వంటివి మూడూ మూల స్తంభాలలాగా జాతిని ముందుకు నడిపించవలసివుంటే నాల్గవ స్తంభంలాగా మిగిలిన మూడు స్తంభాలకు తోడుగా మీడియా జతై ఫోర్త్ ఎస్టేట్‌గా అవతరించింది.

ప్రజల చేత ఎన్నుకోబడి ప్రజా సంక్షేమం కోసం పనిచేసే పరిపాలన వ్యవస్థే లెజిస్లేటివ్(రాజకీయ వ్యవస్థ).

(మిగతా 10వ పేజీలో)



## విషమంగా ఎస్.పి.బాలు ఆరోగ్యం

గత 50 సంవత్సరాలుగా భారతీయ సినిమా సంగీత ప్రపంచాన్ని తన గానామృతంతో పావనం చేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గత 50రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే! గురువారం సాయంత్రం (24వతేదీ) అకస్మాత్తుగా ఆయన ఆరోగ్యం విషమించింది. మెదడుకు సంబంధించిన(బ్రెయిన్ హెమరేజ్) వ్యాధితో ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తెలిసింది. ఇలాంటి తరుణంలో ఆయన కోసం ప్రార్ధనలు చేయడం తప్ప, మరేం చేయలేమని డాక్టర్లు తమ నిస్సహాయతను వెలిబుచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.




## నమో వేంకటేశాయ!



తిరుమల చరిత్రలోనే తొలిసారిగా జరిగిన శ్రీవారి ఏకాంత బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 23వ తేదీ బుధవారం జరిగిన గరుడసేవలో పాల్గొని శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్.

## హుటాహుటిన ఢిల్లీ వెళ్లొచ్చిన సీఎం



ఢిల్లీ పర్యటనలో భాగంగా 22వ తేదీ మంగళవారం నాడు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని కలిసిన సీఎం జగన్

10లో

## • హిందూత్వానికి హాని మచ్చ తెస్తున్న 'నాని'

### బాణీ తప్పుతున్న నానీ వాణి

### మోడీపైనా విమర్శలు



రాష్ట్ర మంత్రి నానీ ఇప్పటికే నోటికొచ్చినట్లు మాట్లాడి హిందూత్వానికి మచ్చతెస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతుంటే... మళ్ళీ తాజాగా ఏకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీనే టార్గెట్ చేసి మాట్లాడి కొత్త వివాదానికి తెరలేపాడు.

3లో

# జపనీస్ పరిశ్రమల నిలయంగా శ్రీసిటీ

## - ఫిక్కీ ఆన్‌లైన్ సమావేశంలో ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

జపాన్ దేశానికి చెందిన 25కి పైగా పరిశ్రమలు ప్రస్తుతం శ్రీసిటీలో ఉన్నాయని, ఇక్కడ పారిశ్రామిక స్నేహపూర్వక వాతావరణం ఉండడంతో జపనీస్ పరిశ్రమలు మరిన్ని వచ్చేందుకు అవకాశం ఉందని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. భారత్ జపాన్ ద్వైపాక్షిక బంధం మరింత బలపడేలా శ్రీసిటీ ఎల్లవేళలా కృషి చేస్తూనే ఉంటుందని ఆయన చెప్పారు. ఈనెల 19న ఫిక్కీ-సార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ సంస్థలు ఏర్పాటు చేసిన నివేదికను ఆవిష్కరించడం కోసం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసిసిఐ) నిర్వహించిన ఆన్‌లైన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత ఈ కార్యక్రమంలో ప్రసంగించిన కేంద్ర విదేశాంగమంత్రి డాక్టర్ సుబ్రహ్మణ్యం జైశంకర్, జపాన్ రాయబార కార్యాలయ ప్రతినిధి తోషిహిడే ఆండో ప్రసంగాలను ఆయన ఉటంకిస్తూ మేక్ఇన్ ఇండియా ఫర్ వరల్డ్ విధానంతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం వైపు శ్రీసిటీ పయనిస్తోందన్నారు. ఫిక్కీ ప్రెసిడెంట్ డాక్టర్ సంగీతారెడ్డి, డెప్యూటి సెక్రటరీ జరల్ మనీష్ సింఘాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



## శ్రీసిటీని సందర్శించిన కరికాల వలవన్



రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపిఐఐసి వైస్ ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. కరికాల వలవన్ ఈనెల 20న శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీ పురోగతిని వివరించారు. శ్రీసిటీ ఎంతో పురోగమిస్తున్నదని, 25 జపాన్ పరిశ్రమలు కూడా ఇక్కడ ఉండడం సంతోషకరమని కరికాల వలవన్ అభినందించారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com

is now

**www.lawyerpatrika.com**

## స్వచ్ఛమైన పాలతో ఆరోగ్యం




గూడూరు రెండో పట్టణంలోని మాలవ్యానగర్ ప్రాంతంలో విజయ డైయిరీ పాలఉత్పత్తుల దుకాణాన్ని ఆ సంస్థ ఎం.డి కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ లేని పాలతో ప్రజలకు ఆరోగ్యం ఉంటుందని వివరించాడు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చెగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు, అధ్యక్షులు గుండాల ఆదినారాయణ, మయూరి శ్యాం యాదవ్, మధురెడ్డి, వేగూరు రాజేంద్ర ప్రసాద్, జహంగీర్, మెట్టా రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

జిల్లాలో ఇటీవలి వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, నాణ్యత కోల్పోయిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొని రైతులను కష్టాల నుంచి గట్టెక్కించాలని జిల్లా రైతు సంఘాల సమాఖ్య నాయకులు చిరసాని కోటిరెడ్డి, ఏవిఆర్ నాయుడు, హనుమంతరావు నాయుడు ఈనెల 22న జిల్లాకు విచ్చేసిన కేంద్ర బృందాన్ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

## లబ్ధిదారులకు రైస్‌కార్డులు

కొత్తగా ధరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డులను లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలని ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 22న ఆయన విడవలూరులోని ఎంపిడిఓ కార్యాలయంలో సచివాలయం ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమై కొత్తగా రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరుతూ వచ్చిన ధరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. గ్రామ వాలంటీర్లు తమ పరిధిలో ఈకేవైసి పూర్తిచేసి రైస్‌కార్డులను అందజేయాలన్నారు.

## ● హిందూత్వానికి హాని

# మచ్చ తెస్తున్న 'నాని'

**● బాణీ తప్పుతున్న నానీ వాణి ● మోడీపైనా విమర్శలు**

**● కుట్రకోణం ఏదైనా ఉందా.. అని పార్టీ వర్గాల అనుమానం**

ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల మంత్రి కొడాలి నానీ మాటలు రాను రాను బాణీ తప్పుతున్నాయి..? తరచూ ప్రతిపక్ష నేతల మీద మాటల తూటాలు పేల్చే నాని.. ఇప్పుడు బాణీ తప్పి హిందుత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వివాదాలకెక్కాడు. నోటికి వచ్చినట్లు మాట్లాడి హిందుత్వానికి మచ్చ తెస్తున్నాడు.

ఆయన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుని వాడు, వీడు, బొచ్చుగాడు, బొంగుగాడు అని సంబోధిస్తాడు, చంద్రబాబు కొడుకు చిన్నబాబు లోకేషబాబును సుద్ద పప్పు, తెలివితక్కువ దద్దమ్మ, చవట వంటి ఇంకా అనేక పదాలతో స్తుతిస్తాడు. ఆయన చేసే ఆ విమర్శలు వ్యక్తిగతమైనవి, రాజకీయమైనవి కూడా. తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి గురించి గతంలో తెలుగు తమ్ముళ్లు అతిగా వాగారు కాబట్టి ఇప్పుడు నాని వాళ్లకూ వాళ్ళ నాయకుడికీ రెండింతలు కౌంటర్ ఇచ్చి తమ నాయకుడి మెప్పు కోసం ఆరాటపడుతున్నాడు. అంతవరకూ సరే.. కానీ ఆయన ఇప్పుడు ఏకంగా హిందూత్వాన్ని, హిందూ సంప్రదాయాలని ప్రశ్నించే స్థాయికి దిగజారడం బాధాకరం.

ఆంజనేయస్వామి విగ్రహాన్ని కేవలం ఒక రాయిగా వర్ణించడం, దుర్గమ్మ గుడిలో రథం నుండి చోరీకి గురైన వెండి సింహాలను 10 కిలోల వెండితో పోల్చడం, అంతర్వేదిలో అగ్నికి ఆహుతైన శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి రథాన్ని చెక్కముక్కలతో పోల్చడం, తిరుమలలో డిక్లరేషన్ పద్ధతి ఎవరు పెట్టారు ...? ఎవడినడిగి పెట్టారు..?? ఎందుకు పెట్టారు..?? అని ప్రశ్నించడం మంత్రి అజ్ఞానానికి, హిందుత్వం పట్ల ఆయనకున్న నమ్మకానికి అద్దం పడుతున్నాయి.

ఇటీవల ఒక టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో అయన మాట్లాడుతూ "రాష్ట్రంలో హిందువులకు తామే ఛాంపియన్లమని బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు మాట్లాడుతున్నాయని, ఆంజనేయస్వామి చెయ్యి విరగ్గొడితే ఆయనకు పొయ్యేదేమి లేదు అది బొమ్మే, దుర్గగుడి సింహాల కోసం వినియోగించిన 10కేజీల వెండి ఎత్తుకుపోతే దానివల్ల 6 లేదా 7 లక్షల నష్టం తప్ప హిందువులకు పోయేదేమీ లేదు, అంతర్వేదిలో రథం తగలబెడితే ప్రభుత్వం కోటి రూపాయలతో కొత్త రథాన్ని చేయిస్తుంది. దీనివల్ల గుడికి కానీ భక్తులకు కానీ వచ్చిన నష్టం లేదు, ఎవడికి కావాలండీ ఇవన్నీ" అంటూ ఆయన వ్యాఖ్యానించాడు.

రాజకీయంగా ఆయన ఎన్నైనా మాట్లాడుకోవచ్చు ఎంతైనా దిగజారొచ్చు, కానీ బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో కూర్చుని ఇలా హిందూ దేవుళ్ళ గురించి హిందువుల ఆచారాలగురించి నోటికేదొస్తే అది మాట్లాడడం ఆయన పార్టీవాళ్లకే కాదు ఆయన పక్కనున్నోళ్ళకు కూడా నచ్చడం లేదు. తాను ఏం మాట్లాడినా అది సంచలనాత్మకమై టీవీల్లో సామాజిక మాధ్యమాల్లో జనం విపరీతంగా చూస్తున్నారన్న మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ఆయన ఏం మాట్లాడినా చెల్లుతుందనుకుంటే అది పొరపాటే. ఇప్పుడు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఆయన చేసిన వ్యాఖ్యలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే.



దేవాలయాలు, దేవుళ్ళపై ఆయన చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలకు విజ్ఞత ఉన్నవాళ్లయితే ఆ మాటలను ఉపసంహరించుకోవడమో లేక వివరణ ఇచ్చుకుని క్షమాపణ చెప్పుకోవడమో చేస్తారు ఆయనకి ఆపాటి విజ్ఞత కూడా లేదు.

### ఈయన ఎవరి మనిషి..?

అసలు అమాత్యులవారు నిజంగా వైసిపి మనిషా...? లేక జూనియర్ ఎన్టీఆర్ గూఢచారా...? అనే అనుమానం ఇప్పుడు వైసిపి శ్రేణుల్లో కలుగుతోందని వినికిడి. జగన్మోహన్‌రెడ్డి ఆయనకు ఎంత పెద్ద పీట వేసినా ఆయన మొదటి ప్రాధాన్యత మాత్రం జూనియర్‌వైపే ఉంటుందన్నది ఇటీవల ఆయన మాటల్లోనే బట్టబయలయ్యింది. చంద్రబాబుపై వ్యతిరేకతతో తమ పార్టీలోకి వచ్చాడు తప్ప, తమ నాయకుడిపైన ప్రేమతోనో, లేక తమ పార్టీపై అభిమానంతోనో కాదన్నది వైసీపీ నేతల అభిప్రాయం. ఎవరేమన్నా అమాంతం నోరేసుకుని పడిపోయే నానీ వల్ల భవిష్యత్తులో పార్టీకి లాభమా...? లేక నష్టమా..?? అన్నది పార్టీ పెద్దలు ఆలోచిస్తే మంచిదని కూడా వాళ్లలో వాళ్ళు చర్చించుకుంటున్నారని తాడేపల్లి సమాచారం.

### మోడీపై విమర్శలు ఇందులో భాగమేనా?

విషయం బాగా ముదురుతున్న తరుణంలో మళ్ళీ తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ మోడీ రామమందిరానికి సతీసమేతంగా వెళ్ళాడా? ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సతీసమేతంగా పూజల్లో పాల్గొంటున్నాడా? అంటూ కొత్త విమర్శలు చేసి మరో వివాదానికి తెరలేపాడు. తాజాగా ఢిల్లీకి వెళ్లి బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకొచ్చిన ముఖ్యమంత్రి తిరిగి వచ్చి 24గంటలు గడవకముందే సొంత పార్టీ మంత్రే బీజేపీని గెలకడం ఇప్పుడు నానీమీదున్న అనుమానాలకు బలం చేకూరుస్తుందని, నానీ పనికట్టుకుని చేస్తున్న విమర్శలలో కుట్రకోణం ఏదైనా ఉందా అన్న అనుమానం కూడా వైసిపి శ్రేణులు వ్యక్తపరుస్తున్నారు. నానీ నిజంగా పార్టీ శ్రేయోభిలాషా? లేక వైసిపిలో చేరి శకుని పాత్ర పోషిస్తున్నాడా? అన్న అనుమానం అందరిలో కలుగుతోంది.

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

## ○ కాలుష్య కోరల్లో నెల్లూరు

# పచ్చని చెట్లు, పార్కులతో 'గ్రీన్ నెల్లూరు' కావాలి

**పబ్లిక్ డిమాండ్**

వందల సంవత్సరాల చరిత్ర కలిగిన నెల్లూరు నగరాన్ని ఇప్పుడు పట్టి పీడిస్తున్న సమస్య కాలుష్యం. నగరంలో పచ్చదనం, పరిశుభ్రత మచ్చుకైనా కనపడడంలేదు. నగరం మొత్తం నిర్మాణాలతో కాంక్రీట్‌జంగిల్‌గా మారిపోయింది. వున్న అరాకొరా చెట్లుకూడా గత పాలకులు వాల్ టు వాల్ రోడ్ వైడనింగ్ పేరుతో నరికి పారేశారు. ఇప్పుడున్న కొరవా దరవా సైడు కాలువల పేరుతో నేటి పాలకులు పెరికి పారేస్తున్నారు.



ఇక పార్కుల సంగతైతే చెప్పనవసరం లేదు. అనాథల్లా అల్లాడుతున్నాయి. వాటి ఆలనా పాలనా చూసే నాథుడే లేడు. ఉన్న సమస్యకు తోడుగా కృష్ణపట్నం (ముత్తుకూరు) ప్రాంతంలో వచ్చిన పవర్ ప్రాజెక్టుల వల్ల వేడితోపాటు బూడిదతో నిండిన కాలుష్యం కూడా ప్రజల ఆరోగ్యాలని హరిస్తోంది.

ఈ ప్రమాదాన్ని నివారించడానికి ఉన్న మార్గం పచ్చదనం ఒక్కటే. నగరంలోని అన్ని రోడ్లలో విరివిగా మొక్కలు నాటి చెట్లను పెంచడమే. రాజకీయాలను పక్కన పెట్టి, వున్న పార్కులన్నిటినీ అభివృద్ధి చెయ్యడమే! నగరంలోని ప్రతీ ప్రాంతానికీ ఒక పార్కు వుంది. అనాదిగా నగరంలో లే అవుట్లు వేస్తున్న వారందరూ నిబంధనల ప్రకారం పార్కుకోసం స్థలాలను వదిలిపెడుతూనే వున్నారు. కానీ ఈ పార్కులు నిర్లక్ష్యానికి గురవుతూనే వున్నాయి. వీటిమీద ఎవరికీ శ్రద్ధలేదు. శ్రద్ధలేదు అనడంకన్నా వీటి విలువ ఎవరికీ తెలియదు. చెట్లు పెంచి నగరాన్ని పచ్చదనంతో నింపడం వల్ల వచ్చే ప్రయోజనం నేటి రాజకీయ నాయకులకు అర్థం కాదు. వారికి అంతటి జ్ఞానమూ లేదు అంతటి పరిజ్ఞానం అసలే లేదు.

చెట్లు, వాటి ప్రయోజనం మనం చిన్నప్పుడు స్కూల్లో చదువుకుంటున్నప్పటి నుండీ తెలుసుకుంటూనే వున్నాం, కానీ వాటి ప్రాధాన్యతని మర్చిపోతున్నాం. ప్రభుత్వం సైతం ఏడాదికోసారి వనమహోత్సవం అంటూ వేలాది మొక్కలు నాటడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి, ఆ ఉత్సవాన్ని ప్రచారం చేసుకోవడానికి కోట్లాది రూపాయలు ప్రకటనల కోసం తగలపెడుతుంది తప్ప, నాటిన మొక్క జీవం పోసుకుంటుందా లేదా ..? అది బ్రతికి పెద్దదవుతుందా లేదా ..?? అని పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఏదో ఆర్భాటంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి పత్రికల్లో టీవీలలో ఫోజులు ఇచ్చి పర్యావరణం కోసం తాము శ్రమపడిపోతున్నాం అనే బిల్డప్ ఇవ్వడం తప్ప, అటు అధికారులు కాని ఇటు పాలకులు కానీ ఎవ్వరూ చిత్తశుద్ధితో పనిచేయడం లేదు.

నెల్లూరు పట్టణంలో ఎక్కడో కొన్ని ప్రాంతాలలో తప్ప మిగిలిన చోట్ల అసలు చెట్లే కనపడవు. ఏడాదిలో ఒక నెల (వర్షాలు పడ్డప్పుడు) తప్ప మిగిలిన రోజుల్లో నగర వాసులకు ఏదో ఎడారిలో ఉంటున్న భావన కలుగుతుంది. ఏడాది పొడుగునా వేసవే అన్న ఫీలింగ్ వస్తుంది. ఇందుకు కారణం చెట్లు లేకపోవడమే, ఏ రోడ్డు చూసినా నిర్జీవంగా కనిపించడమే. ప్రధాన రోడ్ల విషయానికొస్తే గత 20 సంవత్సరాలలో అనూహ్యంగా అభివృద్ధి చెందిన రాజీవ్ రహదారి(మినీ బైపాస్)ని మనం ఉదాహరణగా తీసుకుంటే, అయ్యప్ప గుడినుండి ఆత్మకూరు బస్టాండు వరకు ఉన్న ఈ రోడ్డు మనకి కళాకాంతులు లేకుండా కనిపిస్తుంది. కనీసం వంద మీటర్లకి కూడా ఒక చెట్టు కనిపించదు. ఒకవేళ ఎవరైనా ఆసక్తితో చెట్లు వేస్తే సైడుకాలవల పేరుతోనో పార్కింగుల పేరుతోనో పెరికి పారేస్తున్నారు. ముందుగా నగరంలో ప్రధాన రహదారులని ఎంపిక చేసి వాటిలో మొక్కలు నాటి అవి పెరిగి పెద్దవయ్యేలా అధికారులు పాలకులు చర్యలు చేపట్టాలి. చెట్లతో ఒక్క ఆరోగ్యమే కాదు ఆహ్లాదంతో కూడిన అందంకూడా వస్తుంది.

### ఆలనా పాలనా లేని పార్కులు..

ఇక పార్కుల విషయానికి వస్తే గత ప్రభుత్వంలోని పాలకులు పార్కులపైన కొంత దృష్టి పెట్టారనే చెప్పవచ్చు. కొన్ని ప్రాంతాలలో దురాక్రమణకుగురైన వాటిని కూడా వాళ్ళు విడిపించి అభివృద్ధి చేశారు. వాటిపై కోట్లు ఖర్చు పెట్టారు. అయితే ఆ తరువాత వాటిని గాలికి వదిలేశారు. పార్కు అభివృద్ధి చేసిన అనంతరం అక్కడ స్థానికంగా వున్న అసోసియేషన్ వాళ్లకి ఆయా పార్కులను అప్పజెప్పినా.. వాళ్ళే వాటి బాగోగులు చూసుకుంటారు, అయితే ఇక్కడో సమస్య వుంది. పార్కులను పూర్తిస్థాయిలో మెయింటైన్ చెయ్యాలంటే ప్రతీ పార్కుకి ఒక వాచ్‌మాన్ కావాలి. రోజూ ఉదయం, సాయంత్రం మొక్కలకు, లాన్‌కి నీళ్లుపట్టి పార్కు ఆలనా పాలనా చూడాలి. పూర్తిస్థాయిలో మనిషిని పెట్టుకోవడానికి కూడా చాలా అసోసియేషన్‌లు సిద్ధంగా వున్నాయి, అయితే వారికొచ్చిన సమస్యల్లా సదరు మనిషికి వసతి ఏర్పాటు చెయ్యడమే. పార్కుని అభివృద్ధి చేసే తరుణంలోనే అక్కడ ఒక గ్రంధాలయంతో పాటు వాచ్‌మాన్ వుండడానికి ఒక గదిని కూడా ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. ఆ నిర్మాణాలను కూడా తమ స్వంత నిధులతో చేసుకోవడానికి కొన్ని అసోసియేషన్‌లు సిద్ధంగా వున్నాయి, అయితే పార్కులలో నిర్మాణాలు చెయ్యడానికి వీలు లేదంటూ కోర్టు ఆదేశాలున్నాయని కుంటి సాకులుచెప్పి అడ్డుకుంటున్నారు అధికారులు. అమ్మ పెట్టా పెట్టదు, అడుక్క తిననీయదు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు వీళ్ళు. పరపతి, పలుకుబడి వుంటే ఎంతటి నిర్మాణాలకైనా అనుమతులిస్తున్నారు, అవి రెండూ ఉంటే వీళ్ళకి కోర్టులు గుర్తుకు రావు, ఉదాహరణకు, మాగుంట లే అవుట్‌లోని లెక్చరర్స్ కాలనీలో కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో సి.వి.రావు ఫౌండేషన్ పేరుతో అభివృద్ధి చేసిన పార్కులో భారీ నిర్మాణాలు చేపట్టారు, ఇక్కడ అప్పటి అధికారులకు కోర్టు తీర్పులు ఆదేశాలు గుర్తుకు రాలేదు, పోర్టు వారి పరపతే కనిపించింది.

నగరంలో 100కుపైగానే పార్కులు వున్నాయి. వీటిల్లో దాదాపుగా 50కిపైగా అభివృద్ధి చేయబడ్డాయి, కానీ దిక్కు లేకుండా నిర్జీవంగా వున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఈ పార్కులకు ప్రాణం పోయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు చేపడితే బాగుంటుంది. నగర కార్పొరేషన్‌కి కొత్తగా వచ్చిన యువ కమీషనర్ ఈ విషయంపై దృష్టిపెట్టాలి. అధికారులు సహకరిస్తే చేయి కలపడానికి సామాజిక బాధ్యత కలిగిన పౌరులు సిద్ధంగా వున్నారు. నిర్మాణాలకు అవసరమైన నిధులు ఇవ్వడానికి దాతలు కూడా రెడీగా వున్నారు. అటు రోడ్లలోను ఇటు పార్కులలోనూ పచ్చదనాన్ని బ్రతికించి "గ్రీన్ నెల్లూరు"గా నగరాన్ని తీర్చిదిద్దితే నెల్లూరు సుందర వనంగా మారుతుంది.

## 'ప్రభా'తం

రైతుల శ్రేయస్సు కోసం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ బిల్లులు వ్యవసాయ రంగానికి మేలిమలుపు వంటివి. వీటివల్ల వ్యవసాయ రంగంలో సమూలమైన మార్పు, కోట్లాది రైతులకు సాధికారత సాధ్యమవుతుంది. దళారీవ్యవస్థ తొలగిపోతుంది. కనీస మద్దతు ధర విధానం, ప్రభుత్వం ద్వారా ధాన్యం సేకరణ విధానం కొనసాగుతాయి. రైతుల ఆదాయం రెట్టింపవుతుంది. **- ప్రధాని మోదీ**

# వ్యవ'సాయానికి' కొత్త చట్టాలు

**రైతుల సంక్షేమానికి కేంద్రం ఇటీవల తెచ్చిన మూడు బిల్లులను కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీలు వ్యతిరేకిస్తున్నా..దేశంలో వ్యవసాయరంగం అభివృద్ధికి ఈ బిల్లులు ఎంతగానో ఊతమిచ్చేవేననడంలో ఎలాంటి సందేహం లేదు. అంతేకాదు, దేశంలో చాలాకాలం తర్వాత వ్యవసాయ రంగంలో ఇంత భారీ సంస్కరణలు రావడం కూడా ఇదే ప్రథమం. ఆ ఘనత ప్రధాని మోడీకి, కేంద్రప్రభుత్వానికే దక్కుతుంది. అయితే ఈ సంస్కరణలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన పథకాలు, చేయాల్సిన కృషి ఇంకా ఎంతో ఉంది.**

దేశానికి వెన్నెముక అయిన రైతును కానీ, రైతుల కష్టాలను కానీ ఎంతోకాలంగా పట్టించుకునే నాధులు లేకపోవడంతో దేశంలో రైతుల బాధలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. ఆరుగాలం కష్టించి పంటలు పండించడం ఒక ఎత్తయితే వాటికి గిట్టుబాటు ధర రాకపోవడం, వాటిని విక్రయించుకునే సౌలభ్యాలు లేకపోవడం వగైరా కారణాలతో రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అందులోనూ ఈ కరోనా కష్టకాలంలో రైతుల బాధలు మరింతగా పెరిగాయి కూడా. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం రైతుల బాధల్ని ఆకళింపు చేసుకుంటూ వారిని అన్నివిధాలా ఆదుకునేందుకు కృషిచేస్తుండడం రైతుల్లో ఎంతో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. రైతులకు అన్ని విధాలా మేలు జరిగేలా తాజాగా కేంద్రం మూడు వ్యవసాయ బిల్లులను అమలులోకి తెచ్చింది. రైతులు తాము కోరుకున్న ధరకు, కోరుకున్న చోట తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఈ బిల్లుల ద్వారా అవకాశం కలగడం రైతాంగానికి నిజంగా ఒక మహదవకాశమే అవుతుంది. దీంతో ఇంతకాలంగా రైతాంగాన్ని పట్టి పీడిస్తున్న దళారుల పీడ వదిలిపోతుంది. రైతులు తమ పంటలకు తగిన గిట్టుబాటు ధరలు పొందేందుకు, ప్రైవేటు పెట్టుబడులు, సాంకేతికతను సమకూర్చుకునేందుకు ఈ కొత్త చట్టాలు బాగా ఉపయోగపడతాయని వేరే చెప్పనక్కర లేదు. వీటిలో ప్రధానంగా రైతులు తమ ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోనే విక్రయించుకోవాలనే నిబంధనను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది. అదేవిధంగా పంట వేయడానికి ముందే వ్యవసాయ ఉత్పత్తుల విక్రయంపై వ్యాపారులతో రైతులు చేసుకునే ఒప్పందాలకు రక్షణ కల్పించే బిల్లు, సహకార బ్యాంకులపై పర్యవేక్షణ అధికారాలను ఆర్‌బిఐకి కట్టబెడుతూ తీసుకువచ్చిన బిల్లు.. ఈ మూడు బిల్లులు నేడు దేశంలో ఎంతగానో విస్తరిస్తున్న వ్యవసాయరంగం అభివృద్ధికి ఊతమిచ్చేవే. ఎందుకంటే సరిగ్గా ఇలాంటి సంస్కరణల కోసమే ఆయా రంగాల నిపుణులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. అవి ఇప్పటికి ఆచరణలోకి వచ్చి.. త్వరలోనే రైతుల కళ్ళ ముందు సాక్షాత్కరించబోతున్నాయి. ఈ కొత్త చట్టాల వల్ల రైతులు దేశంలో ఎక్కడైనా, ఎవరికైనా తమ ఉత్పత్తులను తమకు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించుకునే అవకాశం లభించినట్లయింది. ఆన్‌లైన్‌లో కూడా ఉత్పత్తులు అమ్ముకోవచ్చు. రైతులపై ఎక్కడా ఎలాంటి ఆంక్షలు ఉండవు. ఇందుకు రైతులు ప్రత్యేకంగా మార్కెట్ ఫీజు చెల్లించాల్సిన అవసరం కూడా ఉండదు. వ్యాపారులు రైతులతో చేసుకున్న ఒప్పం దాలను ఉల్లంఘిస్తే చట్టబద్ధంగా వారి నుంచి పరిహారం పొందే హక్కు ఈ చట్టాల ద్వారా రైతులకు ఉంటుంది. వ్యవసాయానికి సాయంగా వచ్చిన ఈ కొత్త బిల్లులతో దేశంలో చాలా కాలం తర్వాత వ్యవసాయ రంగంలో ఇంత భారీ సంస్కరణలు రావడం ఇదే ప్రధమంగా చెప్పుకోవచ్చు. ఆ ఘనత ప్రధాని మోడీకి, ఆయన సారధ్యంలోని కేంద్రప్రభుత్వానికి దక్కడం మరో విశేషం. అయితే ఈ బిల్లులు రైతాంగానికి నష్టం కలిగిస్తాయని, రాష్ట్రాలు ఆదాయం కోల్పోతాయని, బహిరంగ వేలం విధానం లేకుంటే వ్యాపారుల మధ్య పోటీ ఉండదని, ఫలితంగా ధరలు తగ్గిపోయి రైతులు నష్టాల పాలవుతారని, వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని నీరుగార్చడం వల్ల అసంఘటిత రంగంలోని కోట్లాదిమంది రైతులు మార్కెట్ శక్తుల చేతుల్లో మోసపోతారని విమర్శిస్తూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఆ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తుండడం, హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో రైతులు ఆందోళనలకు దిగడం తెలిసిందే. దేశంలోని కోట్లాదిమంది చిన్న రైతులకు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు దేశంలో ఎక్కడికైనా తరలించగలిగే సామర్ధ్యం ఎక్కడుంటుందన్నదే వారి ప్రశ్న. వారికి మద్దతు ధర ఎలా వస్తుందనేదే వారి సందేహం. అందుకు కూడా తాజాగా ప్రధాని మోడీ ధీటుగా సమాధానం చెప్తూ రైతులకు అన్యాయం చేసేవాళ్లే కనీస మద్దతు ధరపై రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని అంటూ, వ్యవసాయ మార్కెట్లకు ఈ బిల్లులు వ్యతిరేకం కానే కావని స్పష్టం చేయడం విశేషం.

ఏదేమైనా ఈ మూడు కొత్త చట్టాల వల్ల రైతుల ఉత్పాదనల విక్రయాలు, వ్యాపారం సజావుగా సాగడమే కాక, ముఖ్యంగా దళారీవ్యవస్థ నుంచి రైతులకు విముక్తి కలుగుతుందని గట్టిగా విశ్వసించవచ్చు. రైతు సంక్షేమానికి చేసిన ఈ చట్టాలు దేశంలో రైతులకు ఎంతో ఊరట, భవిష్యత్తుకు భరోసానిచ్చే విధంగా ఉన్నాయి కూడా.

అయితే వీటితో పాటు అన్ని వ్యవసాయ సీజన్లలో రైతన్నల పంటలకు, ముఖ్యంగా పేద, మధ్య తరగతి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, తద్వారా వారిని కష్టాల నుంచి ఆదుకునేందుకు ప్రభుత్వాలు శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాట్లు చేయాల్సి ఉంది. రైతుల అభ్యున్నతికి అవసరమైన వ్యవసాయ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు బాగా అభివృద్ధి చేయాలని, పంటల నిల్వలకు శీతల గిడ్డంగులు ఉండాలని, మార్కెట్ రంగంలోని లోపాలను సరిదిద్దాలని, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయలు కలుగజేస్తుండాలని వ్యవసాయరంగ నిపుణుల అభిప్రాయం. ఇలాంటి సూచనలను కూడా పరిశీలించి పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ముఖ్యంగా కేంద్రంతో పాటు రాష్ట్రప్రభుత్వాలు కూడా ఈ విషయాల్లో మరో ముందడుగు వేసి మేధావులు, నిపుణులు, రైతు ప్రతినిధులతో కూలంకుషంగా చర్చించి, రైతన్నలకు ఎలాంటి వసతులు, వెసులుబాట్లు ఉండాలో నిర్ణయించుకుని వ్యవసాయరంగంలో ఇంకా మేలైన విధానాలు, అవసరమైతే మరిన్ని సంస్కరణలను తీసుకువచ్చి తద్వారా అన్నదాతల సంక్షేమానికి శాశ్వత ప్రాధిపతికపై పథకాలను చేపట్టి చిత్తశుద్ధితో రైతుల సంక్షేమానికి మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కస్తూరిదేవికి కాపలా ఎవరు...?




ఎందరో త్యాగధనుల స్ఫూర్తితో బాలికల విద్య కోసం ఆవిర్భవించిన శ్రీ కస్తూరి దేవి విద్యాలయానికి ఇప్పుడు కాపలా ఎవరు...? గత 26 సంవత్సరాలుగా స్కూలుని, స్కూలు ఆస్తులని తన స్వంత ఇంటికన్నా జాగ్రత్తగా కాపాడుకొచ్చిన జెవి రెడ్డి గారు ఇప్పుడు లేరు అనే మాట తలచుకుంటేనే పై ఆలోచన వస్తుంది. రోజూ సరిగ్గా ఉదయం 9.30కి మళ్ళీ సాయంత్రం 3 .30గంటలకల్లా స్కూలు ప్రాంగణంలోకి అయన కారు వచ్చేది, ఎంతో నిబద్ధతో అయన ఈ విద్యాలయాలను నడిపేవాడు. ఒక తరుణంలో ప్రభుత్వ సహకారం లభించకపోయినప్పడికి తన స్వంత నిధులతో పాటు కొందరి దాతల సహకారంతో జీతభత్యాలు ఇచ్చి స్కూలును కాపాడుతూ వచ్చాడు. స్కూలు అనేక వివాదాలలో చిక్కుకున్నా , ఆయనపై చాలామంది విమర్శలు చేసినా అయన వేటినీ లెక్క చెయ్యలేదు. అయనపై నమ్మకంతో తన సమీప బంధువు బెజవాడ గోపాలరెడ్డి గారు పెట్టిన నమ్మకాన్ని అయన చివరి శ్వాస వరకు నిలబెట్టుకున్నాడు. అయన నిష్క్రమించిన మరుక్షణం మొత్తం కమిటీ పెత్తనాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని కొంతమంది స్థానిక సభ్యులు గోతికాడ నక్కలా కాచుకుని వున్నారని తెలుస్తోంది. ఇప్పుడు కమిటీ భాద్యతలు చూడవలసిన దొడ్లశేషారెడ్డి గారు మద్రాసులో వుంటారు, సంస్థ భాద్యతలను బుజాలకెత్తుకున్న జివికె రెడ్డిగారు హైదరాబాదులో ఉంటారు, ప్రస్తుతం ఒక ఏట (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)కి ఇక్కడ బాధ్యతలు అప్పచెప్పారని తెలిసింది. ఆ ఏట ఇప్పటికే స్థానిక సభ్యుడికి జేబులో మనిషై పోయాడని వింటున్నాం. జెవి రెడ్డిగారు వున్నప్పుడే స్థానిక సభ్యుడి అండతో ఈ ఏట అజమాయిషి ఎక్కువగానే వుండేదని, ఇక ఇప్పుడు వీరి ఆగడాలకు అడ్డుండదేమోనని అంటున్నారు. అసలు ఈ ఏట కనీసం నెల్లూరు జిల్లావాడు కూడా కాదు, ఆయనకు ఈ సంస్థ గురించి ఏమీ తెలియదు , సంస్థ వ్యవస్థాపకుల గురించి అవగాహన లేదు ఇలాంటి పరిస్థితుల్లో కస్తూరిదేవికి ఇప్పుడు కాపలా ఎవరు...? అన్న ఆందోళన కలుగుతోంది. జె.వి. రెడ్డిగారు స్వర్గస్తులయ్యారు కాబట్టి ఇప్పుడు కమిటీ సభ్యులు వెంటనే సమావేశమై కమిటీని పునర్వ్యవస్థకరించి నిస్వార్థంగా సంస్థ కోసం పనిచేసే కొంత మంది స్థానిక సభ్యులను కమిటీలోకి తీసుకుంటే బాగుంటుంది. లేని తరుణంలో స్థానికంగా కస్తూరిదేవి ఆస్తులను లే అవుట్ చేసి అమ్మేయడం ఖాయం.

వి.ఎస్.ప్రసాద్, **హైదరాబాదు.**

# సెంటిమెంట్లతో ఆడుకోవద్దు

ఇన్నాళ్లూ కులరాజకీయాలకు వేదికగా నిలిచిన ఆంధ్రా రాజకీయాలు ఇప్పుడు మత రాజకీయాలకు తెరలేపుతున్నాయి. ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌పైన, ఆయన ప్రభుత్వంపైన బురదజల్లే ప్రయత్నంలో దేవుళ్లను, హిందూ సంప్రదాయాలను వివాదాల్లోకి లాగుతున్నాయి ఇతర రాజకీయ పార్టీలు. ఇది మంచి పద్ధతి కాదు. వాళ్ళ స్వార్ధ ప్రయోజనాల కోసం, నీచపు రాజకీయాల కోసం సెంటిమెంట్లను అడ్డం పెట్టుకునే పని ఎవరు చేసినా అది క్షమించరాని తప్పే. తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చి సంతకం పెట్టాలా వద్దా అన్నది ముఖ్యమంత్రి అభీష్టానికే వదిలెయ్యాలి. ఇన్ని కోట్ల మంది ప్రజల ఆశీస్సులతో గెలిచిన ఆయనకు మంచి చెడుల గురించి, ప్రజల అభీష్టాల గురించి ఒకరు చెప్పాల్సిన అవసరం లేదు. అసలు ఈ విషయంపై ప్రస్తావన తేవడమే అనవసరం. అది ఎవరు చేసినా అర్ధరహితమే. అసలు విషయాన్ని పక్కనపెట్టి, మంత్రి కొడాలి నాని ఇతర దేవాలయాల్లో జరుగుతున్న దాడులను , దొంగతనాలను, దహనకాండలను సమర్ధిస్తూ.. దానివల్ల ఎవరికీ నష్టంలేదని మాట్లాడడం మూర్ఖత్వమే అవుతుంది. చేతినిండా దారాలు కట్టుకున్న కొడాలి ఇలా మాట్లాడడం చుస్తే సిగ్గేస్తుంది. గౌరవప్రదమైన పదవిలో వున్న అయన ఇలా నోరు అదుపులోలేకుండా హిందూ దేవాలయాల గురించి, హిందువుల సెంటిమెంట్ల గురించి కామెంట్ చెయ్యడం హాస్యాస్పదం. అన్ని మతాలవారిలోను ఎవరికున్న సెంటిమెంట్లు వారికుంటాయి, పార్టీ ఏదైనా, వ్యక్తి ఎవరైనా ఇలా సెంటిమెంట్లతో ఆడుకోవద్దని నా మనవి.

పి.నారాయణ, **వెంకటేశ్వరపురం, నెల్లూరు.**

# 5 వరకు మాతృభాష పాలసీ బాగుంది

ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వం ఇటీవల కొత్తగా తెచ్చిన విద్యా చట్టం బాగుంది. ముఖ్యంగా యువతకు ఈ చట్టం బాగా ఉపకరిస్తుంది. ఏ కారణాల చేతనైనా డిగ్రీ మధ్యలో ఆపేసి ఒక ఏడాది తరువాత చదవాలనుకున్నా మొదటినుండీ కాకుండా ఆపేసిన దగ్గరనుండే ప్రారంభించే విధానం, తొలి ఏడాది పూర్తైన తరువాత సర్టిఫికెట్ ఇచ్చి రెండవయేడాది ముగియగానే డిప్లొమా ఇవ్వడం, ఫైనల్ ఇయర్‌కి ఒక ఏడాది ముందే డిగ్రీ వంటివి విప్లవాత్మక మార్పులు సంచలనాత్మక నిర్ణయాలు. యంఫిల్ డిగ్రీని పూర్తిగా తీసేయడం, అన్నింటినీ మించి 5వ తరగతి వరకు ఖచ్చితంగా మాతృభాషకు ప్రాధాన్యత కల్పించాలన్న నిర్ణయాలలో ఆర్‌ఎస్‌ఎస్ భావాలు గలిగిన మోడీ మార్కు స్పష్టంగా కనిపిస్తుంది.


*- యం.చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ.**

లాయర్
పాఠకులకు మనవి
మా(మీ) లాయర్ పత్రికకు
**సమాచారం / లేఖలు**
పంపదలచిన వారు
**9866314741** నంబరుకు
వాట్సయాప్ ద్వారా గాని, లేదా
lawyerpatrika@gmail.comకి
ఈ-మెయిల్ ద్వారా గాని
పంపవలసిందిగా విజ్ఞప్తి.
పోస్టల్ చిరునామా :
ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.
- సం/-

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

*గత 35ఏళ్ళ చరిత్రను తిరగరాస్తూ వరుసగా ఈ రెండవ ఏడాది కూడా వరదనీరు పోటెత్తడంతో ఈనెల 19 నాటికి సోమశిల జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 77.988 టిఎంసిలకు చేరుకుని జలకళతో తొణికిసలాడింది. పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం, మరోవైపు జిల్లాలో చెదురు మదురుగా కురుస్తున్న వర్షాలతో జలాశయం నిండా నీటితో కళకళలాడింది.*

*ఎట్టకేలకు ఈనెల21 నాటికి వరద తగ్గుముఖం పట్టింది.*



# నిండా నీటితో...
# సోమశిల

- రికార్డు స్థాయిలో ఈ ఏడాది కూడా 78 టిఎంసిల నీరు
- పెన్నానదిలో ఉరవళ్ళు పరవళ్ళు

గత వారం రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు ప్రవాహంలా వచ్చిపడుతుండడంతో సోమశిల డ్యామ్‌కు చెందిన 10 గేట్లు ఎత్తివేసి పెన్నానదికి నీటిని వదిలేశారు. రికార్డుస్థాయిలో ఇంతటి జలకళ సోమశిలలో కనిపించడం చాలా ఏళ్ళ తర్వాత ఇదే ప్రథమం అనుకోవచ్చు. దీంతో పెన్నా డెల్టాకు కేటాయించిన 91,254 క్యూసెక్కులకు గాను ఈనెల 19 నాటికి 49,245 క్యూసెక్కుల వంతున 1,02,674 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పెన్నానదికి వరద నీటి ప్రవాహం ఉధృతమైంది. ఈనెల 20 నుంచి వరదనీటిని 1.5 లక్షల క్యూసెక్కుల వంతున అధికారులు విడుదల చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు కూడా బాగా అనుకూలించడంతో సోమశిల జలాశయంలో నీటిమట్టాలు బాగా పెరిగాయి. ఇప్పుడు రెండవ పంటకు సుమారు 5లక్షల ఎకరాలకు సాగునీరు సిద్ధంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పెన్నమ్మ పరవళ్ళు

సోమశిల జలాశయానికి వరద ఉధృతి పెరగడంతో ఇప్పటికే సోమశిల మిగులు జలాలలను అధికారులు పెన్నానదిలోకి వదులుతున్నారు. సోమశిలకు వచ్చిన వరద ప్రవాహాన్ని వచ్చినట్లుగానే పెన్నానదికి వదిలేస్తున్నారు. మరోవైపు ప్రధాన కాలువల ద్వారా జిల్లాలోని అనేక చెరువులను పూర్తిస్థాయిలో నింపుతూ సేద్యానికి సాగునీటి కొరత లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కండలేరు జలాశయానికి రోజూ సుమారు సుమారు 11వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కండలేరు జలాశయంలో 38 టిఎంసిల నీటిని నిల్వ చేశారు. గత నాలుగురోజులుగా సుమారు 18 టిఎంసిల నీటిని పెన్నానది ద్వారా సముద్రానికి వదిలేయడంతో పెన్నమ్మ వరద నీటితో పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది. పెన్నానదీ పరీవాహక ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలు వరదనీటి ముంపునకు ఈ వరద ప్రవాహంతో సుమారు పదిహేనేళ్ళ తర్వాత పెన్నానది వరద నీటి ప్రవాహంతో ఉరవళ్ళు పరవళ్ళతో సాగుతోంది. చేజర్ల మండలంలోని కోటితీర్థం, తూర్పుకంభంపాడు, మడపల్లి, పుట్టుపల్లి, పెళ్ళూరు తదితర గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. సంగం మండలంలోని వీర్లగుడిగ్రామం జలదిగ్భంధంలో చిక్కుకుంది. సంగం మండలంలోని వీర్లగుడిగ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెంలో పంటపొలాల నీట మునిగాయి. పెన్నానదిలోకి ఎవరూ వెళ్ళకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, వరదనీటి ప్రవాహం వల్ల ఎవరికీ ఆపద రాకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు అనేక గ్రామాల్లో నదీపరీవాహక ప్రాంతాల్లో పెద్దఎత్తున పోలీసు గస్తీని ఏర్పాటుచేశారు.



## వరద తగ్గుముఖం

వరద నీటి ప్రవాహం ఈనెల 21 నాటికి కొద్దిగా తగ్గుముఖం పట్టడంతో అధికారులు సోమశిల జలాశయం నీటి నిల్వను 73 టిఎంసిలకు కుదించారు. సోమవారం ఉదయం 1.12 లక్షల క్యూసెక్కులున్న వరద ప్రవాహం సాయంత్రానికల్లా 65వేల క్యూసెక్కులకు తగ్గింది. పైతట్టు ప్రాంతాల నుంచి వరదనీటి ప్రవాహాన్ని గమనిస్తూ ముందుజాగ్రత్త చర్యగా అధికా రులు ఈ చర్య తీసుకున్నారు. భారీగా నీటిని విడుదల చేయడంతో డ్యామ్ ఎడమ వరద రక్షణ కట్ట కొద్ది మేర కొట్టుకుపోవడంతో వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ వరద కారణంగా సుమారు 8 కోట్ల రూపాయల దాకా పలు రకాల పంటలకు నష్టం జరిగివుంటుందని, వరిపొలాలు మునగడంతో మరో 10 కోట్ల దాకా వరిపంటకు నష్టం వాటిల్లివుంటుం దని అధికారులు అంచనా. మరో రెండుమూడు రోజుల్లో వరద ప్రవాహం బాగా తగ్గవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# రైతుల బాధలు విన్న.. కేంద్ర బృందం



జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు ఈనెల 22న కేంద్ర బృందం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతుల నుంచే విన్నారు. రోడ్లపై రైతులు ఆరబోసుకుని ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యుల అంజాద్‌ఖాన్, కిరణ్, నవీన్‌లతోపాటు జిల్లా జాయింట్‌కలెక్టర్ హరీంద్ర ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ డిఎం రోజ్‌మాండ్, తహశీల్దార్ ప్రసాద్‌లతో కలసి ఈ కేంద్ర బృందం వెంకటాచలం మండలంలోని అనికేపల్లి, గొలగమూడి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం వెంకటాచలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తాము పడుతున్న ఇబ్బందులను వారి ఎదుట మొరపెట్టుకోగా, తప్పకుండా ఆదుకుంటామని కేంద్ర బృందం హామీ ఇచ్చింది. మనుబోలు మండలం, జట్లకొండూరులోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములను, దగదర్తి మండలంలో మునకకు గురైన పంటపొలాలను కేంద్రబృందం సందర్శించింది.

### కోవిడ్ బాధితులకు..
# సత్వర వైద్యసాయం అందించాలి

జిల్లలో కోవిడ్ వైరస్ కేసులను త్వరిత గతిన గుర్తించి బాధితులకు అవసరమైన వైద్యసహాయం అందజేయాలని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కాటంనేని భాస్కర్ జిల్లా వైద్య అధికారులకు సూచించారు. ఈనెల 21న ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోవిడ్ పరిస్థితులపై జిల్లా అధికారులతో సమీక్షించారు. కోవిడ్ పాజిటివ్ బాధితులను వెంటనే ఆసుపత్రుల్లో అడ్మిట్ చేయాలని, హోం క్వారంటైన్లలో ఉన్నవారికి పిహెచ్‌సి వైద్యాధికారులు, సిబ్బంది ఆరోగ్య సలహాలు, మందులు అందజేయాలని ఆదేశించారు. కోవిడ్ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, బాధితులకు నాణ్యమైన భోజనం, వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజ్యలక్ష్మి, జిజిహెచ్ సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు జిల్లాలో ఒక్కగ్రామం కూడా
# భారత్ నెట్‌లో అనుసంధానం కాలేదా?

**- రాజ్యసభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి నెల్లూరు జిల్లాలో ఒక్క గ్రామ పంచాయతీ కూడా భారత్ నెట్ కింద అనుసంధానం కాలేదనడం వాస్తవం కాదా?.. అందుకు కారణాలేమిటి? జిల్లాలోని దాదాపు వెయ్యి గ్రామాలు భారత్ నెట్ కింద ఎప్పటిలోగా కనెక్ట్ కానున్నాయని ఎంపీ వేమిరెడ్డి ఈనెల 22న రాజ్యసభలో ప్రశ్నించారు.

అందుకు కేంద్ర మంత్రి సంజయ్ ధోత్రే స్పందించి మాట్లాడుతూ భారత్ నెట్ ప్రాజెక్ట్‌ను దశలవారీగా ఆంధ్ర ప్రదేశ్‌తో సహా దేశంలోని దాదాపు 2.50 లక్షల గ్రామాలన్నింటిని బ్రాడ్‌బ్యాండ్‌తో అనుసంధానించడానికి కృషి జరుగుతోందని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రాజెక్టు తొలిదశ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా అమలు చేయబడుతోందని, నెల్లూరుజిల్లా ఈ దశలో భాగం కాదని పేర్కొన్నారు. అందువల్ల ఇప్పటిదాకా జిల్లాలో ఒక్క గ్రామపంచాయతీలో కూడా ఈ ప్రాజెక్టు కింద కనెక్ట్ చేయబడలేదన్నారు. రెండవ దశలో ఈ ప్రాజెక్టును ఆగస్ట 2021 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుజిల్లాతో సహా పూర్తిచేయాలని నిర్ణయించడం జరిగిందని వివరించారు. అయితే కరోనా, లాక్‌డౌన్‌ల వల్ల ఆ సమయం ఇప్పుడు పొడిగించడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సూచన కారణంగా ఏరియల్ పద్ధతి నుండి భూగర్భ ఫైబర్ పద్ధతిలో మార్పును సూచించినందున ఈ పనులను రాష్ట్రంలో ప్రభుత్వం నిలిపివేయడం జరిగిందన్నారు.

రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రూసా) పథకం గడువు ముగిసిందా... ఈ పథకాన్ని విస్తరించే ప్రతిపాదనేమైనా ఉందా?..అని వేమిరెడ్డి ప్రశ్నించగా కేంద్రమంత్రి అందుకు బదులిస్తూ ఈ పథకం రెండవ దశను 2017 ఏప్రిల్ నుండి 2020 మార్చి 31 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ ఆమోదం ఉందని, ఈ పథకం గడువు సమయాన్ని మరింతగా పొడిగించేందుకు 15వ ఆర్థిక కమిషన్ అనుమతి, మూల్యాంకన, నివేదిక, సమీక్ష ఫలితంపై ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

### అన్నదాతలకు..
# అన్నివిధాలా అండగా ఉంటాం

**- జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



జిల్లాలోని రైతులందరికీ అన్నివిధాలా ప్రభుత్వ అధికారయంత్రాంగం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. ఈనెల 22న నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఎడగారు సీజన్‌లో సుమారు 5 లక్షల ఎకరాల్లో వరిపంట సాగైందని, జిల్లా వ్యాప్తంగా 87 ధాన్యం కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేసి ఈనెల 22వతేది నాటికి 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ధాన్యం అమ్మిన రైతులకు ఏరోజుకారోజు డబ్బు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే 4665 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 150 కోట్ల రూపాయల మొత్తాన్ని జమచేయడం జరిగిందన్నారు. నాణ్యత తక్కువగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాపటు కొనుగోలు సమయాన్ని పెంచాలని, ఈ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు ధాన్యం పంపేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతులు కోరామని, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో కేంద్రప్రభుత్వం అందుకు సుముఖత వ్యక్తం చేసిందని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.22 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 4లక్షల టన్నులు, ఎడగారులో ఇప్పటిదాకా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. జిల్లా చరిత్రలోనే రైతాంగం ధాన్యం ఉత్పత్తిలో రికార్డు సృష్టిస్తోందని, మరో 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే పరిస్థితి ఉందన్నారు. ధాన్యం భద్రపరుచుకునేందుకు గోడౌల్ల కొరత అధిగమించేందుకు కూడా కృషి చేస్తున్నామని, కొత్తగా 175 గోడౌన్లు నిర్మించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జేసీ హరేందిరప్రసాద్ పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## 'గుడ్‌మార్నింగ్ నెల్లూరు'

**--- కొత్త కమిషనర్ వినూత్న కార్యక్రమం ---**



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఇటీవలే వచ్చిన కమిషనర్ దినేష్ కుమార్ నెల్లూరు నగరంలోని సమస్యల పట్ల బాగా దృష్టి సారించారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలనే కృషిలో ఉన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజు నుంచి ఉదయాన్నే రోడ్ల మీదికి వచ్చి పారిశుద్ధ్య పరిస్థితులను గమనిస్తున్నారు. ఉదయం 5.30 నుంచి 7.30 గంటల దాకా ఆయన చేపడుతున్న ఈ కార్యక్రమంతో వీధుల్లో పరిశుభ్రత ఇప్పుడిప్పుడే మెరుగుపడుతోంది. ఇప్పుడు 'గుడ్ మార్నింగ్ నెల్లూరు' అనే కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 9 గంటల దాకా నగరంలోని సచివాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఆ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఈ వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈనెల 25న 6వ డివిజన్ పప్పులవీధి, 26న కిసాన్‌నగర్, 28న 11వ డివిజన్ రాయపుపాళెం, 29న 15వ డివిజన్ ఆకుతోట అంబేద్కర్ రీడింగ్‌రూం, 30న ముత్యాలపాళెం సచివాలయాల వద్ద సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వీటిలో వచ్చే ఫలితాలను బట్టి తదుపరి ప్రణాళిక రూపొందిస్తామని కూడా ఆయన వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అన్నిశాఖల అధికారులతో కలిసి స్పందన వేదికలను రూపొందిస్తున్నామన్నారు.

## దేవుడా!..నానీకి మంచి బుద్ధి ప్రసాదించు

హిందూ దేవుళ్లను, హిందూ ధర్మాన్ని కించపరుస్తున్న రాష్ట్ర మంత్రి కొడాలి నానికి మంచి బుద్ధిని ప్రసాదించాలంటూ విశ్వహిందూ పరిషత్, భజగరంగ్‌దళ్ నాయకులు ఈనెల 22న నెల్లూరులోని రంగనాధస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రార్థించారు. విహెచ్‌పి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ధర్మప్రచార సంఘం అధ్యక్షుడు ధ్వని శ్రీనివాస్, భజరంగ్‌దళ్ నాయకులు సాయి, నాగూరు, సత్య తదితరులు పాల్గొన్నారు.

### 'క్యాట్'లో సత్తా చాటిన

## కృష్ణచైతన్య విద్యార్థులు



జాతీయస్థాయిలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా వారు అకౌంటెన్సీ విద్యార్థుల కోసం నిర్వహించే సిఏటి పరీక్షల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో విజయదుందుభి మోగించారు. ఈ పరీక్షలకు హాజరైన తమ కళాశాల విద్యార్థుల్లో 90 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని, వారిలో పి.కావ్యసీతశ్రీ 90 శాతం, దాక్షాయమృతా 80 శాతం మార్కులను సాధించి జాతీయస్థాయిలో తమ కళాశాల పేరు నిలబెట్టారని కళాశాల డైరెక్టర్లు డా. ఆర్.వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఉత్తమస్థాయిలో రాణించిన ఆ విద్యార్థులందరినీ డైరెక్టర్లతో పాటు డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్స్ యన్.కృష్ణ కుమార్, ఎన్ నాగయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ తదితరులు అభినందించారు.

## అల్జీమర్స్ పట్ల అప్రమత్తత అవసరం

అల్జీమర్స్(మతిమరుపు) వ్యాధి పట్ల అందరికీ అవగాహన అవసరమని నెల్లూరులోని మెడికవర్స్ ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ దీక్షాంతి నారాయణ్ చెప్పారు. ఈనెల 21న ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, మానసిక వత్తిడి తదితర కారణాలతో 55 ఏళ్లలోపే మతిమరుపు వ్యాధి వస్తుంటుందని, మంచి ఆహారం తీసుకోవడం, సమయానికి నిద్రపోవడం, వత్తిడులను తగ్గించుకోవడం ద్వారా ఈ వ్యాధి బారినుంచి బయటపడవచ్చని సూచించారు. వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించాలని, లేకుంటే వృద్ధాప్యంలో అదొక పెద్ద సమస్యగా మారుతుందని పేర్కొన్నారు.

### ఏసీ కూరగాయల మార్కెట్

## మళ్లీ మొదలైంది

**- రైతులకు, వినియోగదారులకు ఊరట**



కరోనా నేపథ్యంలో గత మేనెల నుంచి మూతపడి ఉన్న నెల్లూరు నగరంలోని ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ మళ్లీ ఈనెల 21 నుంచి ప్రారంభం కావడంతో రైతులు, వ్యాపారులతో పాటు వినియోగదారుల్లో కూడా సంతోషం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఏఎంసి ఛైర్మన్ ఎంబేటి ఏసయ్య మాట్లాడుతూ కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా ఇంతవరకు ఈ మార్కెట్‌ను జాతీయ రహదారి వద్దకు మార్చామని, అయితే రైతులు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా మార్కెట్‌ను మళ్లీ యథాతథంగా ప్రారంభిస్తున్నామని చెప్పారు.

### సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును

## పరిశీలించిన కమిషనర్

నెల్లూరు రూరల్‌లోని కొత్తూరు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఈనెల21న కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ట్యాంకు నిర్వహణకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరాలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

### పునరావాస కేంద్రాల

## ప్రజలకు ఆహారం

పెన్నా వరదతో పునరావాస కేంద్రాలకు చేరిన లోతట్టు ప్రాంతాల ప్రజలకు మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ సూచనలతో ఈనెల 21న వైకాపా నాయకులు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పిఎంఆర్ స్కూల్‌లో ఉన్న సుమారు 300 మంది బాధితులకు కొణిదెల సుధీర్‌కుమార్, బిఇడి కళాశాలలో ఉన్న 350 మందికి వందవాసి రంగా, పాత మునిసిపల్ కార్యాలయంలో ఉన్న సుమారు వెయ్యి మందికి స్థానిక నాయకులు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు.

## వృద్ధులకు అన్నదానం

ప్రధాని నరేంద్రమోడీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 20న నెల్లూరులోని బిజెపి స్టోన్ హౌస్‌పేట కమిటీ ఆధ్వర్యంలో పార్థసారధినగర్‌లోని ఇందిరా మహిళామండలి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. పార్టీ ఎస్‌సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, పార్టీ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, శ్రీధర్, రవీంద్ర, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# హద్దుమీరితే కఠిన చర్యలు

### రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

రౌడీషీటర్లు ఏమాత్రం హద్దుమీరినా కఠినచర్యలు తప్పవని, వారిపై నాన్‌బెయిలబుల్ కేసులతో పాటు నగర బహిష్కరణ కూడా విధిస్తామని నెల్లూరు నగర పోలీసులు గట్టిగా హెచ్చరించారు. ఈనెల 20న నగరంలోని చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సుమారు 35 మంది రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇన్‌స్పెక్టర్ మధుబాబు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు ఇప్పుడు ఏ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు, వారేం చేస్తున్నారో ఆరా తీశారు. ప్రతిఒక్క రౌడీషీటర్‌పై పోలీసుల నిఘా ఉంటుందని, ఎవరైనా మద్యస్థాలు, దందాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవన్నారు. బుద్ధిగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారిపై రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి తమ వంతు సహకారం అందిస్తామని కూడా చెప్పారు. గొడవలు, అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలుంటాయని పదేపదే హెచ్చరించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీహరి తదితరులు రౌడీషీటర్లు తమ దుష్ప్రవర్తన మానుకుని మంచిమార్గంలో నడవాలన్నారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com

is now

www.lawyerpatrika.com

### బాలలకు

## వస్త్రాల వితరణ

నెల్లూరులోని రాఘవనాయుడు చారిటబుల్ ట్రస్ట్ 10వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న గీతామయి బాలభవన్‌లోని బాలలకు అన్నదానం చేసి వస్త్రాలను అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామిశెట్టి రాఘవనాయుడు ఆధ్వర్యంలో ఈనెల 20న ఈ సేవా కార్యక్రమం జరిగింది. బాలాజీ నగర్ సిఐ మంగారావుతో పాటు బాలభవన్ నిర్వాహకుడు తమ్మినేని పాండు, రియాజ్‌బాషా, శ్రీనివాసులు, రమాదేవి, దేవ, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### డిఆర్‌డిఏ ఇన్‌చార్జి పీడీగా

## నాగలక్ష్మి

డిఆర్‌డిఏ పీడీగా ఉన్న నాగేశ్వరరావు అనారోగ్యానికి గురికావడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి పీడీగా తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ పి.ఏ నాగలక్ష్మిని నియమించారు. నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో ఆమె ఈనెల 22న బాధ్యతలు చేపట్టారు.

## నానీని బర్తరఫ్ చేయాలి

**- బిజెపి నాయకుల డిమాండ్**

హిందువుల మనోభావాలు దెబ్బతినేవిధంగా మాట్లాడిన నానీని రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బిజెపి నెల్లూరు మండల నాయకులు డిమాండ్ చేశారు. నానీ వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 22న నగరంలోని శెట్టి గుంటరోడ్డు వద్ద ధర్నాచేశారు. బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పి. ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీధర్, హరికృష్ణ, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ

## కాంగ్రెస్ నిరసన




ఏఐసిసి అధినేత సోనియా గాంధీ, పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్, డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిల ఆదేశాలతో ఈనెల 22న నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాభవన్‌లో ఈ ఆందోళన చేపట్టారు. ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన వ్యవసాయ బిల్లులు దేశంలోను, రాష్ట్రంలోనూ రైతాంగానికి నష్టం కలిగిస్తాయని, రైతుల సంక్షేమం ఆలోచించకుండా రాష్ట్రంలో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలో బిజెపికి మద్దతివ్వడం సిగ్గుచేటని ఆయన దుయ్యబట్టారు. డిసిసి ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, కార్యదర్శి అరవ రామ్మోహన్‌రావుతో పాటు నాయకులు మావులూరు సురేష్‌బాబు, ఎన్ రాజేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పప్పర్తి గణేష్‌బాబు, జిల్లామైనార్టీ సంఘం అధ్యక్షులు షేక్ అల్లావుద్దీన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, శ్రీనివాసులు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## నటసామ్రాట్ అక్కినేని జయంతి



నటసామ్రాట్ డా. అక్కినేని నాగేశ్వరరావు 97వ జయంతి వేడుకలు నెల్లూరు నేతాజీనగర్‌లోని హరిత వృద్ధుల ఆశ్రమంలో ఈనెల 20న ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బొగ్గవరపు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమం నిర్వాహకురాలు రాజేశ్వరమ్మ, రమణమూర్తి, విజయగోపాల్, రమణయ్య, ప్రముఖ సాహితీవేత్తలు డా. గంగిశెట్టి శివకుమార్, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి పాల్గొని అక్కినేని నటనా వైభవాన్ని వివరించారు. అనంతరం డా. గంగిశెట్టి శివకుమార్, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, బొగ్గవరపు శ్రీమన్నారాయణలను ఆశ్రమ నిర్వాహకులు సత్కరించారు.

# జిల్లాలో ఇక.. పారిశ్రామిక పరుగులు

## ఆత్మకూరు వద్ద 400 కోట్లతో ఇండస్ట్రియల్ హబ్‌కు శంకుస్థాపన

జిల్లాలోని ఆత్మకూరు మండలం నారంపేట వద్ద 400 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేయనున్న ఇండస్ట్రియల్ హబ్‌కు ఈనెల 20న రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇక్కడ సుమారు 178 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలసి మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొలివిడతగా ఇక్కడ 87 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి కృషి జరుగుతుందని, సుమారు 2వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తాయని చెప్పారు. ఏడాది లోగానే ఈ ఇండస్ట్రియల్ హబ్ నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసు



కుంటున్నామన్నారు. జిల్లాలో రానున్న రోజుల్లో పారిశ్రామికరంగం ఎంతో పురోగమిస్తుందన్నారు. ఎక్కడికక్కడ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధిపథంలో ఉండేందుకు అన్ని విధాలా తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండో పంటకు సాగునీరు అందించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా సోమశిల ఉత్తర కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించామని, సోమశిల జలాశయంలో నియోజకవర్గానికి 6 టిఎంసిల నీటిని శాశ్వతంగా కేటాయించేలా ఏర్పాటుచేస్తామని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులతోపాటు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# కేంద్రమంత్రితో అనిల్ భేటీ

## పోలవరం నిధుల విడుదలకు హామీ

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈనెల 21న ఢిల్లీకి వెళ్ళి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్‌ను కలిశారు. పోలవరం ప్రాజెక్టు బకాయిలు, పునరావాస ప్యాకేజీ నిధులను విడుదల చేయాలని, 2021 నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా లక్ష్యం నిర్ధేశించుకున్నామని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. కృష్ణానదిపై ప్రాజెక్టుల వల్ల రాయలసీమకు కలిగే ప్రయోజనాలను కూడా ఆయన కేంద్రమంత్రికి వివరించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి రెండు మూడురోజుల్లోనే పోలవరం బకాయిల నిధులు 4వేల కోట్లు విడుదల చేస్తామని మంత్రి అనిల్‌కు హామీ ఇచ్చారు.

## సచివాలయాల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి అన్నారు. ఈనెల 22న మండల కేంద్రమైన తోటపల్లి గూడూరులో గ్రామ సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించడంలో వాలంటీర్లదే కీలకపాత్ర అన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఆయా ప్రాంతాల్లో ఎవరైనా కరోనాతో హోం క్వారంటైన్లలో ఉన్నవారిని గుర్తించి వారికి జాగ్రత్తలు, సూచనలు చెప్పి ఇళ్ళ నుంచి బయటకు తిరగకుండా, కరోనా వ్యాప్తిచెందకుండా చూడాలన్నారు. పారిశుద్యం కార్మికులు గ్రామాల్లో పరిశుభ్రతా చర్యలు తీసుకుంటూ, డ్రైనేజీల్లో పూడిక తీయిస్తూ ప్రజలకు అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

Please note the change

www.lawyerteluguweekly.com is now www.lawyerpatrika.com

# హిందూ దేవాలయాల పట్ల అనవసర వ్యాఖ్యలు తగదు

## - మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



రాష్ట్రంలో హిందూ దేవాలయాల విషయంలో చోటు చేసుకుంటున్న కొన్ని పరిణామాలు దురదృష్టకరమని, వాటిని ప్రోత్సహించేలా కొందరు మంత్రులు మాట్లాడడం విచారకరమని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 22న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతోకాలంగా అన్ని మతాలవాళ్ళం కలసి మెలసి బతుకుతున్నామని, ఒకరి మతాన్ని మరొకరం గౌరవించుకోవడం అలవాటుగా మార్చుకున్నామని, తిరుమలలో హిందూయేతరులు డిక్లరేషన్‌లో సంతకం పెట్టే సంప్రదాయం అనాదిగా వస్తోందని, వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు పొందాలంటే అక్కడి ఆచారాన్ని గౌరవించాలని పేర్కొన్నారు. అప్పట్లో సాక్షాత్తూ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఉమ్మడి రాష్ట్రంలో గవర్నర్ కేసి అబ్రహం కూడా డిక్లరేషన్‌లో సంతకం పెట్టారని, సోనియాగాంధీ, రాజశేఖరరెడ్డి సంతకం పెట్టలేదని.. అది ఉల్లంఘనేనని, ఇప్పుడు కూడా ఉల్లంఘిస్తామనడం సరికాదని ఆయన తెలిపారు. కేరళలోని అనంతపద్మనాభస్వామి దేవాలయంలో షర్టు లేకుంటేనే అనుమతిస్తారని, ఇప్పుడు ఏపీలో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నవారు అక్కడి ఆలయంలోకి షర్టు ధరించి వెళ్ళగలరా?.. అని ఆయన ప్రశ్నించారు. అనాదిగా వస్తున్న ఆచారాలను ఉల్లంఘించడం ఏమిటని ఆయనన్నారు. గతంలో ఏమైనా పొరపాట్లుంటే సరిదిద్దాల్సింది పోయి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించడం సరికాదన్నారు.




# పీడిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు

## ➤ బెంబేలెత్తుతున్న బాధితులు

***అదేం మాయదారి రోగమో కానీ ఈ కరోనా కష్టకాలంలో కూడా అనేక ప్రైవేటు ఆసుపత్రుల తీరు మారడమే లేదు. ఎవరెంతగా బాధలు పడుతున్నా, ఎవరెంతగా నెత్తీనోరూ బాదుకుంటున్నా, అటు ప్రభుత్వం ఇటు అధికారులు ఎన్నిసార్లు గట్టిగా హెచ్చరిస్తున్నా నెల్లూరుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రుల తీరు మాత్రం మారడం లేదు. పేదలని కూడా కనికరం లేకుండా ఉన్నదంతా ఊడ్చుకుంటున్నారని ఎక్కడ విన్నా ఒకటే విమర్శలు.***

అసలే కరోనాతో జనం భయపడి చస్తుంటే, ఇప్పుడు ఏ చిన్న జబ్బు వచ్చినా, జలుబు చేసినా, సాధారణ జ్వరమొచ్చినా మరింతగా హడలిపోవాల్సి వస్తోంది. జబ్బుతో భయపడే కంటే, తప్పనిసరై ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే వచ్చే ఆ బిల్లు చూసుకుని, జేబులకు పడుతున్న చిల్లు చూసుకుని గుండెలు బాదుకోవాల్సి వస్తోందని రోగులు గగ్గోలు పెడుతున్నారు. ఈ కరోనా విపత్తులో.. ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయకూడదని అధికారులు ఎంత గట్టిగా హెచ్చరిస్తున్నా..ఇవన్నీ తమకు మామూలే కదా అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు. కరోనాతో పాటు, ఇతరత్రా ఏమైనా అనారోగ్యాలు కలిగినా వైద్యం చేసేందుకు కొన్ని ప్రైవేటు ఆసుపత్రులకు తప్పనిసరై అనుమతివ్వడంతో ఇదే అదనుగా పలు ఆసుపత్రుల వారు రోగులను పట్టి పీడిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కరోనా చికిత్సకైతే గుండె ఘాం అనే రీతిలో ఫీజులు వసూలు చేస్తున్నారని, లక్షల రూపాయలు చేతుల్లో ఉంటే తప్ప అక్కడ వైద్యం అందడం లేదని రోగులు హడలిపోతున్నారు. రోజువారీ చికిత్స పేరుతో వేలరూపాయలు లాగేస్తున్నారని ఎక్కడ బట్టినా చర్చగా ఉంది.

### సాధారణ జబ్బుకూ వేలల్లో బిల్లు

అంతేకాదు, సాధారణ అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్ళినా అక్కడ రకరకాల పరీక్షలు, స్కానింగ్‌లతో హడలగొట్టి మరీ డబ్బు దోచేసుకుంటున్నారని ప్రజలు లబోదిబోమంటున్నారు. ఈ కరోనా విపత్తు సమయంలో ప్రజలను ఆదుకోవాల్సిన ఆసుపత్రులు కేవలం ధన సంపాదనే ధ్యేయంగా రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు దారుణం. ప్రైవేట్ ఆసుపత్రులకు తగులుకున్న ఈ డబ్బు జబ్బు ఎప్పుడు పోతుందో.. ఆ దేవుడికే తెలియాలి.

### డబ్బు సంపాదనే ధ్యేయమా?...

జిల్లా ఉన్నతాధికారులతో కలసి.. అధికారయంత్రాంగమంతా ఈ కరోనా విపత్తు సమయంలో ఎడతెరపి లేకుండా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించడం, బాధితులకు తమవంతు సహకారం అందించి వారు కోలుకునేలా చేయడం వంటి పనుల్లో అహరహం శ్రమిస్తుంటే, అనేకమంది వైద్యులు, వైద్యసిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా వ్యాధిగ్రస్తులకు చికిత్సలందిస్తున్నారు. వారి దయ వల్లనే ఎంతోమంది తమ ప్రాణాలు కాపాడుకోగలుగుతున్నారు. ప్రజలు కరోనా మహమ్మారి బారిన పడకుండా నిద్ర లేచింది మొదలు పారిశుద్యం పనిచేసే కార్మికులు, పోలీసులు, అన్ని శాఖల అధికారులు ప్రజలకు శక్తిమేరా తమవంతు సేవలందించేందుకు నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు. అలాంటి వారి పుణ్యమా అని ఎంతో మంది రోగులు కరోనా మాయదారి వ్యాధి నుంచి కోలుకుని సంతోషంతో వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు. ఎంత హృద్యమైన సంఘటనలో ఇవి!.. అలాంటి మానవీయ సేవలు చేస్తున్న మహానుభావులందరికీ ఎన్నిసార్లు దండాలు పెట్టుకున్నా తక్కువే!..కానీ, కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులవారికి మాత్రం ఇలాంటివన్నీ పట్టడం లేదు. కనీసం మానవత్వం కూడా లేకుండా సాధారణ రోగులకు కూడా కరోనా బూచిని చూపి పెద్దమొత్తాల్లో డబ్బులు గుంజేసుకుంటున్నారంటే ఏమనుకోవాలి?... అధికారుల ఆదేశాలను సైతం ఏమాత్రం పట్టించుకోకుండా, ఇదే సందని అత్యంత నిర్దయగా అందినకాడికి రోగుల నుంచి డబ్బును పిండేసుకుంటున్న కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల వ్యవహారం మానవత్వానికే మాయని మచ్చగా ఉంటోందని ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు, ప్రభుత్వం ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా తనిఖీలు చేసినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుత్రుల తీరులో మార్పు ఉండకపోగా, రానురాను మరింత పెచ్చరిల్లిపోతూ ప్రతి నిమిషం ధన సంపాదన మీద యావతోనే గడుపుతున్నారు తప్ప.. రోగుల ఆరోగ్యం పట్ల కానీ, వారి ప్రాణాలను కాపాడాలనే నైతిక బాధ్యత కానీ చూపకపోతుండడం ఘోరం!.. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే జేబులు గుల్ల!..అనే విమర్శలే ఎక్కడ విన్నా.

### దయాగుణం, సేవాభావం ఏవీ?

కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల వారు ఇలా రోగుల నుంచి ముక్కు పిండి డబ్బు వసూలు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లున్నారు. దయాగుణం, సేవాభావం మరచిపోయినట్లున్నారు. ఇకనైనా.. సాటి మనిషి ఆరోగ్యం కాపాడేందుకు న్యాయమైన ఫీజులతో సేవలందించాలి. పేదలను కనికరించి వీలైనంత తక్కువ ఫీజుతో వైద్యం చేయాలి. ఇలాంటి విపత్కర సమయాల్లోనే ఎక్కువ ఔదార్యం చూపాలి.

'వైద్యో నారాయణో హరి' అన్న నానుడిని నిజం చేస్తూ మనుషుల ప్రాణాలను నిలబెట్టే ఎంతో పవిత్రమైన వైద్య వృత్తికి ఎలాంటి కళంకం తీసుకురాకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి. తద్వారా అందరి అభిమానానికి పాత్రులు కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## బ్యాంకు రుణాలిప్పించండి


ఎమ్మెల్యే వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

గూడూరు పట్టణానికి చెందిన కొందరు చిరువ్యాపారులు, కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్న మహిళలు ఈ నెల 22వ తేదీ ఎమ్మెల్యే వరప్రసాద్ రావుని కలిసి కరోనా నేపథ్యంలో తమ కష్టాలను చెప్పుకున్నారు. కుటుంబ అవసరాల నేపథ్యంలో రోజువారీ వడ్డీకి అప్పు తీసుకుని, ఆ వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తే, నెలవారీ వాయిదాలు చెల్లిస్తూ అప్పును తీరుస్తామని వారు ఎమ్మెల్యేకు విన్నవించగా, ఆయన స్పందిస్తూ బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణం మంజూరయ్యేలా చేస్తానని మహిళలకు హామీ ఇచ్చాడు.



## పేదలను ఆదుకోండి

**సిపిఎం నాయకుల డిమాండ్**

కరోనా వైరస్ వ్యాప్తి, లాక్‌డౌన్‌తో పేదల జీవనం కష్టతరంగా మారిందని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 10వేలు ఆర్థిక సహాయం చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వారు ఆందోళన చేపట్టారు. పార్టీ రాష్ట్ర నాయకుడు యాదగిరి మాట్లాడుతూ ఉపాధిహామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలని, రైతులు పండించిన పంటలను రూ.16వేలు పుట్టికి చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. మణిప్రసాద్, బి.వి.రమణయ్య, చంద్రయ్య, రాబర్ట్, నరసింహులు, మధు పాల్గొన్నారు.

## కరోనాని జయించి విధులకు వచ్చిన సి.ఐ దశరథరామారావు



కరోనా వైరస్‌ను ఆత్మస్థైర్యంతో జయించాలని డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణ సి.ఐగా విధులు నిర్వహిస్తున్న జి.దశరథరామారావు కరోనాని జయించి తిరిగి విధుల్లోకి రావడంతో డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, గ్రామీణ సి.ఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు పాటిస్తూ వైద్యం చేసుకుంటే కరోనాని జయించవచ్చన్నారు. ఎస్సైలు సైదులు, బ్రహ్మనాయుడు, ఆదిలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.

---

# యువత భవితకు దిక్సూచి 'భావితరాల భవిత మూడు రాజధానులు'

గ్రంథ సమీక్ష

స్వప్రయోజనం కోసం గత ప్రభుత్వం చేసిన దుష్ప్రయోగాల భాగోతంలో నిజానిజాలను వెల్లడి చేసి, మూడు రాజధానుల వల్ల ఒనగూరే ప్రయోజనాలు, పాలనా వికేంద్రీకరణతో కలిగే లాభాలను తెలియజెప్పిన గొప్ప ప్రయత్నం డా॥ గాజులపల్లి రామచంద్రారెడ్డి రచించిన 'భావితరాల భవిత మూడు రాజధానులు'. రచయిత ప్రజల పట్ల బాధ్యతతో మూడు రాజధానుల్ని సమర్థిస్తూ అవి ఏ రకంగా భావితరాలకు ఉపయుక్తం కాగలవో చెప్పిన తీరు ఎంతో హృద్యంగా సాగింది. ఇదో విశిష్ట రచనై ప్రజాబాహుళ్యాన్ని తాకుతోంది.

జగన్మోహన్‌రెడ్డి భావితరాల భవిష్యత్తును ఆలోచించే రాజనీతిజ్ఞుడిగా, క్రాంతదర్శిగా అభివర్ణిస్తూ, ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చే ప్రజానాయకుడిగా బేరీజు వేయడం రామచంద్రారెడ్డిలోని భావనా పటిమకు నిలువెత్తు నిదర్శనం. ఆయనలోని భావోద్విగ్నత ఈ పుస్తకాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చింది. రచయిత చేసిన అక్షరయజ్ఞం ప్రజలకు అమృత ఫలాల్ని అందిస్తుందనడంలో ఎలాంటి సంశయం లేదు. వైయస్ ఆలోచనల్ని పుణికి పుచ్చుకున్నారు జగన్. తండ్రి ఆలోచనల దిశగానే కొడుకు అడుగులేస్తున్నారు. అభివృద్ధి ఒక నగరానికో లేక ఒక్క ప్రాంతానికో పరిమితమై ఉండకూడదనే ఆలోచన నుండే మూడు రాజధానుల ఏర్పాటు ఉత్పన్నమైందని విస్పష్టంగా తెలియజెప్పాడు రచయిత.

### పాలనా వికేంద్రీకరణే

### మహానేత వై.యస్ ఆలోచన

పాలనా వికేంద్రీకరణ ఆలోచన రెండవసారి ముఖ్యమంత్రిగా ఎన్నికైన వైయస్ రాజశేఖరరెడ్డి ఆనాడే చేశాడని రచయిత స్పష్టంగా చెప్పాడు. వరంగల్‌ని రాజధానిగా, ఒంగోలును మరో రాజధానిగా అటు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను సస్యశ్యామలం చేసే ఆలోచన ఆనాటిదేనన్నది రామచంద్రారెడ్డి విశ్లేషణ. మళ్ళీమళ్ళీ ఆంధ్రులకు దురదృష్టం రాకుండా అందరికీ సమ న్యాయం కోసం అందరికీ అభివృద్ధి ఫలాలు అందించడానికి మూడు రాజధానులు అవసరమనే వైయస్ఆర్ కలను తనయుడు జగన్ నిజం చేస్తున్నాడని స్పష్టంగా చెప్తాడు రచయిత.

వనరులు చేకూర్చుకొన్న తర్వాత రాజధానిని బృహత్తరంగా నిర్మిస్తే ఆదర్శవంతంగా ఉంటుందంటాడు రచయిత. దీనికో చక్కని ఉదాహరణ చెప్తారాయన. మార్వాడీల్లాగా బాడుగ ఇంట్లో నివసిస్తూ పెట్టుబడి ఫలాల ద్వారా మాత్రమే సొంత ఇంటి స్వప్నం నెరవేర్చుకోవాలనడం చక్కని ఆలోచన. రాజధాని సైతం అలా నిర్మించాల్సిన అగత్యాన్ని చెప్పకనే చెప్తారాయన.

రాజధాని, హైకోర్టు ఒకేచోట ఉండాల్సిన అగత్యం లేదంటారాయన. అలా లేని రాష్ట్రాలను సోదాహరణంగా వివరించారు. దేశంలోకే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో అయినా, హైకోర్టు అలహాబాదులో ఉండడాన్ని రచయిత మన దృష్టికి తీసుకువస్తారు.




### శివరామకృష్ణన్ కమిటి చెప్పింది కూడా అదే

శివరామకృష్ణన్ కమిటీ కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏకైక అతిపెద్ద రాజధాని నిర్మాణం సరైంది కాదని చెప్పడాన్ని గుర్తుచేశారు. అధికార వ్యవస్థలను వికేంద్రీకరించడంతో బాటు ప్రభుత్వ వ్యవస్థల్ని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ఆ కమిటీ చెప్పిన విషయాన్ని వివరించారు.

అమెరికాలోని అతిపెద్ద పట్టణాలలో ఏ ఒక్కటీ రాజధాని కాలేదంటూ వివరణాత్మకంగా చెప్పడం, ఇవ్వడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ రాజధానిని విజయవాడ, గుంటూరు మధ్య వద్దనే వద్దని మాచర్ల–దొనకొండ ఉత్తమమని చెప్పినా చంద్రబాబు పెడచెవిన పెట్టి తన సామాజికవర్గం లాభాలకే అమరావతి నిర్మించాడని విపులంగా చెప్పాడు రచయిత. రాజధాని భూముల్లో 40 మీటర్ల లోతుకు తవ్వితేగాని రాతిపొర వెలువదని నల్లరేగడి భూముల్లో ఫైల్ ఫౌండేషన్ వేయించి భారీ నిర్మాణ వ్యయంతో నిర్మించాల్సిన అగత్యాన్ని ప్రశ్నిస్తాడు. పటిష్టంగాలేని ఈ భూముల్లో, హైదరాబాద్ అధ్యయన నివేదికల్ని ఉటంకిస్తూ జనానికి జరిగే పెనుప్రమాదాల్ని ముందుగానే హెచ్చరిస్తున్నాడు. ఇక్కడ ఆకాశహర్మ్యాలు చేపడితే శ్రేయస్కరం కాదని కుండబద్దలు కొట్టినట్లు చెబుతూ జగన్మోహన్‌రెడ్డి ఆ ఆలోచనతోనే మూడు రాజధానుల వైపు మళ్ళాడని వివరించాడు రచయిత.


రచన : డా॥ గాజులపల్లి రామచంద్రారెడ్డి

రాజసం లేని రాజధాని ఎందుకని ఉద్వేగంతో ప్రశ్నిస్తాడు రామచంద్రారెడ్డి. జాతికి హృదయం లాంటి రాజధానిని అవినీతి పునాదులపై నిర్మించడం సమ్మతం కాదని ఘంటాపథంగా చెప్తాడు. శాంతి పరిపాలనా సంస్కరణలు వర్ధిల్లిన అమరావతి స్వార్థభూతాల వికటాట్టహాసాల కట్టడాలతో తల్లడిల్లిపోయిందని తాను తల్లడిల్లిపోతూ ఆకుపచ్చ ఆలోచనల శుభకామనల్ని ఆవిష్కరిస్తాడు రచయిత. శాస్త్రజ్ఞులు నెత్తీనోరు మొత్తుకున్నా చంద్రబాబు వినని వైనాన్ని ఎండగడ్తూ వివరాలందించారాయన.

### మూడు రాజధానులు

### రాష్ట్ర సమగ్రాభివృద్ధికి శుభపరిణామం

లెజిస్లేటివ్ రాజధాని ఒక ప్రాంతంలో, పరిపాలనా రాజధాని మరొక ప్రాంతంలో, జ్యూడిషియల్ రాజధాని ఇంకొక ప్రాంతంలో సర్వజనామోదంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజధాని నిర్మాణం చేయాలనుకొన్న శుభపరిణామాన్ని ఆనంద దృశ్యమానంగావించాడు రచయిత. రోమ్ ఒక్కరోజులో నిర్మితం కాలేదని, నిర్మిస్తే అది రాజధాని కాదని ప్రజల హృదయాలే నిర్మాణాలు కావాలని రాజధానులుగా విలసిల్లాలని సందేశమిస్తాడు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర అందరి గుండె దీపాలే మూడు రాజధానులని ప్రస్తావిస్తాడు రచయిత.


సమీక్షకులు: చిన్ని నారాయణరావు
9440202942

### తెలుగువాడి తలపాగా విశాఖ

హైదరాబాద్ తరహాలో అభివృద్ధిలో దూసుకుపోగల అన్ని లక్షణాలతో భాసిల్లే విశాఖ ఎగ్జిక్యూటివ్ రాజధాని కావడం మన అదృష్టం. రాబోయే పదేళ్ళలో విశాఖ టాప్‌టెన్ నగరాల్లో ఒకటవడం ఖాయం. అతిపెద్ద పోర్టు, ప్రపంచస్థాయి హార్బర్ ఉన్న విశాఖపట్నం, షిప్ యార్డు, భారత నౌకా నిర్మాణ కేంద్రం తదితరాలతో, ఖనిజ సంపదతో విలసిల్లే తెలుగువాడి తలపాగా విశాఖ అని చెప్తూ సరికొత్తగా విశాఖను పిలిచారు. అలా తెలుగుతనంపై తన మక్కువను తెలియజేశాడు. అంతేకాక విశాఖప్రాంత ప్రజల ఆత్మీయతను సైతం తెలుసుకొని ప్రస్తావించిన ఘనత రచయిత రెడ్డిగారిది.

### సీఎం వైయస్ జగన్

### దార్శనికతకు నిదర్శనం

'భావితరాల భవిత మూడు రాజధానులు' పుస్తకం ప్రజల బాధను తన బాధగా భావించే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గారి దార్శనికతకు నిలువెత్తు నిదర్శనంగా మలచబడింది. ప్రాంతాల సమతుల్యత, ఆకాంక్షల్ని నెరవేర్చడానికి ఇది సరైన పద్ధతిగా రామచంద్రారెడ్డి భావనకు ఆయన విజ్ఞత మేళవింపైంది.

ఈ పుస్తకాన్ని ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒక్కసారి ప్రజల్లోకి ఈ పుస్తకం తీసుకెళ్ళడమంటే మూడు రాజధానులకు ప్రజల్ని బ్రహ్మరథం పట్టించడమే అవుతుంది.

ఇంత మంచి పుస్తకాన్ని పాఠక లోకానికి అందించిన రచయిత రెడ్డిగారిని అభినందిస్తూ వారి ఆలోచనా విధానానికి నమస్కరిస్తున్నాను.

ఈ 'భావితరాల భవిత'ను వెలువరించడం తమ బాధ్యతగా స్వీకరించి సామాజిక చైతన్యస్ఫూర్తితో యువత భవిత కోసం ముందుకు నడచిన ముగ్గురు అపురూప వ్యక్తులు సీకో బయోటిక్స్ అధినేత శీలం జయరామిరెడ్డి, రాష్ట్ర జిఎస్‌టి అదనపు కమిషనర్ ఎస్.ఇ.కృష్ణమోహన్‌రెడ్డి, 'లాయర్' పత్రిక అధినేతతుంగా శివప్రభాత్‌రెడ్డిలకు నా నమోవాకాలు.

పేజీలు : 80 వెల : రూ.150/-

ప్రతులకు:
శ్రీమతి జి.రత్న
ఫ్లాటు నెం. 60, కమర్షియల్ టాక్సెస్ కాలనీ
విజయవాడ - 8. సెల్ : 77026 57529

Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# రైతులపై కేసుల ఎత్తివేత

ధాన్యానికి మద్దతుధర కల్పించాలని కోరుతూ ఆందోళన చేసిన రైతులపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఈనెల 21న ఎత్తివేశారు. జిల్లాలోని సంగం మండలంలో 14 మంది, బుచ్చి మండలంలో 9మందిపై ఇటీవల పోలీసులు కేసులు నమోదు చేయడంతో జిల్లా నాయకులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 21న నెల్లూరులో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి రైతుల బాధలను వివరించారు. అధికారుల సమన్వయలోపంతో ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరగక, దళారులు తక్కువ ధరకే రైతుల నుంచి ధాన్యాన్ని కొంటుంటే బాధతో రోడ్డెక్కిన రైతులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు కూడా రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. అమాయకులైన రైతులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. దీంతో... ఆయా రైతులపై కేసులు ఎత్తివేయాలంటూ సిఎం కార్యాలయం నుంచి ఆదేశాలు అందడంతో జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఉత్తర్వులతో రైతులపై కేసులు తొలగించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## లక్ష్మీనృసింహునికి.. చందనాలంకారం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి గడియలను పురస్కరించుకుని ఈనెల 20వ తేది వేకువన 4 గంటలకు ఆలయ అర్చకులు శ్రీవారి నిలువెత్తు మూలమూర్తికి అత్యంత శోభాయమానంగా చందనాలంకారం నిర్వహించారు. స్వామివారికి పాలు, తేనె, పసుపు, చందనం, పెరుగు, కొబ్బరినీళ్లు, పంచదార, నెయ్యితో పాటు వివిధ రకాలైన పండ్లు, సుగంధద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో లక్ష్మీనృసింహస్వామికి, ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకపూజలు చేసి శాంతి హోమం, పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామవారి అలంకార మండపంలో స్వామివారిని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా ఆస్థాన సేవ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, త్రినాథ్‌స్వామి, నాగరాజస్వామి, మల్లికార్జునస్వామితో పాటు ఆలయ ఏ.సి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షమ్మకు..వెండి కిరీటం

జిల్లాలో ప్రసిద్ధమైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి దాతలు ఈనెల 20న వెండి కిరీటం సమర్పించుకున్నారు. సంగం మండలం జెండాదిబ్బకు చెందిన అమ్మవారి భక్తులు కొణతాలపల్లి ఆంజనేయుల దంపతులు సుమారు 160 గ్రాముల వెండితో తయారుచేసిన వెండి అర్ధ కిరీటాన్ని అమ్మవారికి బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి దాతలకు స్వామి-అమ్మవార్ల దర్శనం చేయించి, స్వామివార్ల శేషవస్త్రాలు అందజేశారు.

### ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో...

# నెల్లూరు మెడికల్ కాలేజీకి ఎంసిఐ గుర్తింపు

● 120 పీజీ సీట్ల మంజూరుతో వైద్యవిద్యార్థుల్లో సంతోషం

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు దాదాపు ఆరేళ్ళుగా ఎదురుచూస్తున్న ఎంసిఐ గుర్తింపు లభించింది. దీంతో వైద్య విద్యార్థుల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. మెడికోలు, జూనియర్ డాక్టర్లు ఈనెల 21న కళాశాలలో కేక్ కట్‌చేసి ఆనందం పంచుకున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఎంసిఐ గుర్తింపునిస్తూ ఈమెయిల్ ద్వారా కళాశాలకు ఎంసిఐ సమాచారం అందింది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భారతీయ వైద్యమండలి అధికారులతో సంప్రదించి ఎంసిఐ గుర్తింపు వచ్చేందుకు కృషిచేయడం పట్ల కళాశాల వర్గాల్లోను, విద్యార్థుల్లోను సంతోషం వ్యక్తమవుతోంది. దీంతోపాటు 120 పీజీ సీట్లను కూడా



కేకును కట్ చేస్తున్న ప్రిన్సిపల్ సాంబశివరావు

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) మంజూరు చేయడంతో ఎంబిబిఎస్ పూర్తయ్యాక స్పెషలైజేషన్ కోర్సులు చేసేందుకు ఈ మెడికల్ కాలేజీకి తొలిసారిగా అవకాశం దక్కినట్లయింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ఎంతోకాలంగా మెడికల్ కాలేజీకి ఎంసిఐ గుర్తింపు రాక పోవడంతో వైద్య విద్యార్థులు ఆందోళన చెందుతుండేవారని, పీజీ, ఇతర ఉన్నత కోర్సులు అభ్యసించేందుకు ఇబ్బంది పడేవారని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హాస్పిటల్, మెడికల్ కాలేజీల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేసిందని, వైద్యవిద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తూ కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చారని, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో, ప్రజా ప్రతినిధుల సహకారంతో డిఎంఇ, కలెక్టర్ కృషితో కళాశాలకు ఎంసిఐ గుర్తింపు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తనూజ్ రెడ్డి, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇకి అవార్డు

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి సంబంధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో సంబంధిత పర్యవేక్షక అధికారి జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్యశాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఎం.శ్రీనివాసకుమార్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈ అవార్డును ఆయన ఈనెల 20న రాష్ట్ర పంచాయతి రాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

## బడి గంట మోగింది.. అయినా!

కరోనా నేపథ్యంలో దాదాపు ఆరునెలల సుదీర్ఘకాలం విరామం అనంతరం ఈనెల 21వతేదీ సోమవారం బడి గంట మోగింది. పాఠశాలల తలుపులు తెరుచుకున్నాయి. అయినా విద్యార్థుల హాజరు మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పడం ప్రారంభమైంది. జిల్లాలో ఇంకా నాడు-నేడు పనులు జరుగుతుండడంతో పలు పాఠశాలలు ప్రారంభం కాలేదు. పట్టణ ప్రాంతాల్లోనే కాక గ్రామ ప్రాంతాల్లోని పాఠశాలలకు కూడా హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తక్కువగానే ఉంటోంది.

### మహా మహిమాన్విత శక్తిస్వరూపిణి...

# గంగపట్నం.. శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారు

*నెల్లూరుజిల్లాలో ఎంతో ప్రసిద్ధమైన.. పురాతనమైన ఆలయం గంగపట్నంలోని శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయం. భక్తుల కొంగుబంగారంగా కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా శ్రీ చాముండేశ్వరి అమ్మవారు ప్రసిద్ధి.*

నెల్లూరుకు సుమారు 24 కిలోమీటర్ల దూరంలో సముద్ర తీరాన ఉన్న ఈ ఆలయం ఎంతో పవిత్రమైనది.. మహిమాన్వితమైనది కూడా. అమ్మవారిని దర్శించుకుంటే చాలు అనేక రకాల రోగాల నుంచి, బాధల నుంచి విముక్తులవుతుంటారు. ఎంతో ప్రాచీనమైన ఈ ఆలయానికి పురాణకాలం నాటి నుంచి మరెంతో ఘనమైన చరిత్ర ఉంది.


**నాటి క్రౌంచపట్నమే.. నేటి గంగపట్నం :**

పూర్వకాలంలో గంగపట్నాన్ని క్రౌంచపట్టణమనే పేరుతో పిలుస్తుండేవారని, ఈ ప్రాంతం సముద్రతీరం కనుక నత్తగుల్లలు ఎక్కువగా ఉండేవని, వాటిని ఆహారంగా తీసుకునేందుకు క్రౌంచ పక్షులు అనే కొంగలు ఇక్కడ పెద్దసంఖ్యలో విహరిస్తుండేవని, అందువల్ల దీనికి క్రౌంచపట్టణం అనే పేరు వచ్చిందని అంటారు. ఇక్కడ మంచినీరు ఉప్పగా ఉండడంతో ప్రజలు ఇక్కడి నుంచి కొద్దిదూరం వెళ్ళి నీళ్లు లభించేచోట ఊరు ఏర్పాటు చేసుకున్నారని, దీంతో 'గంగపట్నం' అనే పేరు స్థిరపడిందని చెప్తుంటారు.

**చోళరాజుల కాలం నుంచి మరింత వైభవం:**

ఆ తర్వాత చోళరాజుల కాలం నుంచి ఈ ఆలయంలో ఎంతో వైభవంగా అమ్మవారికి పూజలు జరుగుతుండేవని, 14వ శతాబ్దినాటి చోళులు ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి పూర్వవైభవాన్ని తీసుకువచ్చారని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత 1515 సంవత్సరం ప్రాంతంలో చంద్రగిరి రాజులు అమ్మవారి మూలవిరాట్‌ను పున:ప్రతిష్ట చేసినట్లు ఆలయ దక్షిణ





మన దేవాలయాలు (14)

*భక్తుల పాలిట కల్పతరువుగా గంగపట్నం చాముండేశ్వరిదేవి అమ్మవారు ప్రసిద్ధి. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలంలోని సముద్రతీర ప్రాంతంలో కొలువై ఉన్న ఈ చల్లనితల్లి కోవెల జిల్లాలో ఎంతో ప్రాచీనమైనది. అన్ని రకాల మానసిక పీడలు, గ్రహబాధలు తొలగించి, సకల సంపదలిచ్చే దేవతగా, సంతానప్రదాయినిగా శ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారు ఎంతోకాలంగా భక్తుల పూజలందుకుంటోంది.*

ద్వారంపై చెక్కబడిన శాసనాలు పేర్కొంటున్నాయి.

ఈ ఆలయానికి తూర్పున బంగాళాఖాతం ఉంది. దీంతో ఒకప్పుడు గంగపట్నం రేవుపట్నంగా ఒకప్పట్లో ఎంతో ప్రఖ్యాతి చెందింది. అప్పట్లో సముద్రంపై వెళ్ళే ఓడలు ఈ ఆలయానికి ఎదురుగా వచ్చినప్పుడు అమ్మవారి తీక్షణ దృష్టితో అవి ముందుకు కదిలేవి కాదని, దీంతో వారు అమ్మవారి మహిమాన్విత శక్తిని గ్రహించి అమ్మవారిని ప్రార్థిస్తూ అప్పట్లో తూర్పుముఖంగా ఉన్న ఆలయ ముఖద్వారాన్ని మూసివేసి ఉత్తర-దక్షిణ ముఖద్వారాలు ఏర్పాటు చేశారని కూడా ఓ కథనం ప్రచారంలో ఉంది. ఆ కాలంలో సముద్రంపై ఓడలతో వెళ్ళి వ్యాపారాలు చేసుకునేవారు అనేకమంది ఇక్కడ మజిలీ చేసి అమ్మవారికి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకునేవారని చెప్తుంటారు. ఇటీవలి కాలంలో దాతల సాయంతో ఈ ఆలయం మరింతగా అభివృద్ధి చెందుతూ ఉంది.

**ప్రతిఏటా బ్రహ్మోత్సవాల వైభవం :**

సుప్రశాంతమైన ఆహ్లాదకరమైన సముద్రతీర ప్రాంతంలో వెలసిన శ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ప్రతిఏటా ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఈ ఉత్సవాల్లో సుడిమాను ఉత్సవం, అఖండదీపారాధనతో జరిగే యార ఉత్సవం వంటివి మరింత ప్రసిద్ధి. పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలకు విచ్చేస్తుంటారు. సంతానం లేనివారు ఆలయంలో ఉన్న చెట్టుకు ముడుపులు కట్టుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. సంతానం కలిగాక అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. అంతేకాదు వ్యాధుల బాధలతో అలమటించేవారికి, నానా రకాల సమస్యలతో సతమతమయ్యే వారికి అమ్మవారి ఆలయ దర్శనమాత్రం చేతనే ఆయా బాధల నుంచి విముక్తి కలుగుతుంది. అమ్మవారి పుష్కరిణితో పాటు, ఆలయ ప్రాంగణంలో నాగేంద్రస్వామి పుట్ట, శ్రీ కాళికామాత ఆలయం, కాలభైరవస్వామి గుడి భక్తులను ఆకట్టుకుంటుంటాయి. ఆలయం సమీపంలోనే గంగా పార్వతీ సమేత శ్రీ తారకేశ్వరస్వామి ఆలయం కూడా ఉంది. శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఎంతో విశిష్టమైన ఈ ఆలయాలన్నిటిని కూడా దర్శించుకుని తరిస్తుంటారు.

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com
Please note the change

## కాలధర్మం

# విద్యాశాఖలో మెరిసిన ఆణిముత్యం

# మైథిలీ మనోహరరెడ్డి



మైథిలీ మనోహరరెడ్డిగా నెల్లూరీయులకు చిరపరిచితుడైన బసివిరెడ్డి మనోహర్‌రెడ్డి కరోనా కాటుకు బలైపోయాడు. ఆయన వయస్సు 68 సంవత్సరాలు. ఆయనకు భార్య మైథిలి ముగ్గురు కుమార్తెలు (సొంత కుమార్తెలు కాదు) ఉన్నారు. సెప్టెంబర్ 18వతేదీ రాత్రి 8గంటల ప్రాంతంలో నెల్లూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. 1952, ఫిబ్రవరి4న నెల్లూరుజిల్లా చిట్టమూరు మండలం, రాఘవవారిపాళెంలోని సామాన్య రైతు కుటుంబంలో మనోహరరెడ్డి జన్మించాడు. రాజమ్మ, పిచ్చిరెడ్డిలు ఆయన తల్లితండ్రులు. 1 నుండి 5వ తరగతి వరకూ ఆరూరు గ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తి చేశాడు, ఆ తరువాత 6 నుండి 11 వరకూ విరువూరు, తూర్పుకంభంపాడు, అరవపాళెం, చిట్టమూరులలో చదివి విద్యానగర్‌లో పియూసి పూర్తి చేశాడు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కళాశాలలో బికాం డిగ్రీ అందుకుని అన్నామలై యూనివర్సిటీ నుండి బిఎడ్ పట్టా పుచ్చుకున్నాడు.

### తొలినుంచి సేవాభావం

1977లో దుత్తలూరులో విద్యాశాఖలో క్లర్క్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు మనోహరరెడ్డి. 1982లో టీచర్‌గా ఉద్యోగం సంపాదించి మొదట కలువాయి మండలంలోనూ, ఆ తర్వాత నెల్లూరు, దగ్గమిట్టలో 15ఏళ్లపాటు పనిచేశాడు. తొలినుంచి సేవాభావం కలిగివుండే మనోహర్‌రెడ్డి 2000సంవత్సరంలో మండల విద్యాశాఖాధికారిగా పదోన్నతి పొంది పొదలకూరు ఎం.ఇ.ఓగా, ఆ తర్వాత కోవూరు ఎం.ఇ.ఓగా పనిచేశాడు. పొదలకూరు ఎంఇఓగా పనిచేస్తున్నప్పుడు విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడు, ముఖ్యంగా చదువు సంధ్యలేకుండా మగ్గిపోతున్న ఎందరో బాలకార్మికుల జీవితాలలో విద్యావెలుగులు నింపాడు. వందమంది బాలికలతో రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్‌ను నడిపి రాష్ట్రంలో దానిని అగ్రస్థానంలో నిలిపిన ఘనత మనోహర్‌రెడ్డిది. మండలంలో 2956 మంది బడిబయటవున్న పిల్లలను బడిలో చేర్పించాడు. దీనికోసం ఆయన ఒక ఉద్యమాన్నే సాగించాడని చెప్పాలి. రాజీవ్‌విద్యా మిషన్ ఏఎంఓగా ఆయన విశేష సేవలందించాడు. పాఠశాలలను పర్యవేక్షించ డంలో ప్రత్యేకశైలిని ప్రదర్శించాడు. పిల్లలకు ఆసక్తికరంగా వుండేలా "చిన్నారి" పుస్తకానికి రూపకల్పన చేసి ప్రతి పాఠశాలకు ఆ పుస్తకం అందేలాచేశాడు. విద్యా రంగంలో ఒక సేవా ఆణిముత్యంలా మెరిసి 2009 జూన్30న మండల విద్యాశాఖాధి కారి హోదాలో పదవీవిరమణ పొందాడు. ఇక ఆయన జీవితంలో అవార్డు, రివార్డులకు లెక్కేలేదు. ఎందుకంటే ఆయన విద్యాశాఖలో సాధించిన రికార్డులకు ఇవన్నీ మామూలే!

### మాటే కాదు.. నడత కూడా మనోహరమే

ఆయన పేరే కాదు మాట, మనసు, నడక, నడత అన్నీ మనోహరమే. అందరితో కలుపుగోలుగా వుంటాడు, అందరూ ఆయనను పని రాక్షసుడిగా పిలుస్తారు. ఏపనైనా పట్టుకున్నాడంటే వదలడు, నిద్రాహారాలు మానైనా తాను అనుకున్నది సాధిస్తాడు. 'లాయర్' పత్రికతో ఆయనది కుటుంబ అనుబంధం, లాయర్ ఏ కార్యక్రమం తలపెట్టినా మనోహర్‌రెడ్డి ముందుండేవాడు, తన స్వంత సంస్థలా భావించి 'లాయర్'కి తోడు నీడగా ఉండేవాడు. ఆయన భార్య మైథిలి పేరుతో ఆయనకు స్కూలు వుంది, కానీ ఆయన ఎక్కువ సమయాన్ని సేవాకార్యక్రమాల కోసమే వినియోగించేవాడు.

లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడిగా తన హయాంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టాడు, రెడ్‌క్రాస్‌లో సభ్యుడిగా, స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్‌గా, నెల్లూరుజిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూళ్ళ మేనేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా, అక్షరా ఫౌండేషన్ ఛైర్మెన్‌గా ఆయన సేవలు చిరస్మరణీయం. 2003లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడిగా చేరి 2017 నాటికి డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ స్థాయికి ఎదిగాడు.

ఆరడుగుల ఆజానుబాహుడు, అందరికి ఆత్మీయ మిత్రుడు, వేలాదిమంది చిన్నారులను తీర్చిదిద్దిన ఉత్తమ విద్యా సేవకుడు మనోహర్‌రెడ్డి ఇక లేడన్న మాటే నమ్మలేకున్నాం. మనోహరరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపు కుంటూ, ఆయన ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది 'లాయర్'.

## మనోహర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షుడిగా, జిల్లా అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఫ్రెండ్స్ వాకర్స్ గౌరవాధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు కొనియాడారు. ఈ నెల 24వ తేదీ నెల్లూరు ఏ.సి స్టేడియం ప్రాంగణంలో బి.మనోహర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు జి.వి.కృష్ణయ్య, శ్రీమన్నారాయణ, లక్ష్మీనారాయణ, రాఘవేంద్రశెట్టి, కొండూరు సుబ్బారావు, మారుతీరావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఆ నాలుగు స్తంభాలు

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలనలో ఉన్న ప్రభుత్వం తీసుకునే అన్ని నిర్ణయాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆ నిర్ణయాల అమలులో సాధ్యాసాధ్యాలను విశ్లేషించి వాటిని సక్రమ రీతిలో అమలు చేసే వ్యవస్థే ఎగ్జిక్యూటివ్ (అధికార వ్యవస్థ).

రాజ్యాంగస్ఫూర్తికి, సహజ న్యాయ సూత్రాలకు భంగం కలి గించే విధంగా నిర్ణయాలు చేసినప్పుడు, ప్రభుత్వం తీసు కున్న నిర్ణయాలన్నీ చట్టాలకు లోబడి వున్నాయా లేదా, సదరు నిర్ణయాలను అధికార యంత్రాంగం సముచిత రీతిలో అమలుచేస్తుందా లేదా అని ఓ కంట కని పెడుతూ ఎక్కడన్నా ప్రజా ప్రయోజనా లకు భంగం కలుగుతున్నప్పుడు, మిగిలిన రెండు వ్యవస్థలు ఎక్కడైనా చట్టాలను అతిక్రమిస్తున్నాయన్న భావన కలిగినప్పుడు జోక్యం చేసుకునే సర్వాధికారాలు కలిగిన వ్యవస్థే జ్యుడిషియరీ (న్యాయవ్యవస్థ).

ఈ మూడు వ్యవస్థలూ రాజ్యాంగబద్ద మైనవే కాకుండా చట్టపరంగా సర్వాధి కారాలు కలిగివుంటాయి, అయితే వీటికి తోడుగా సమాచార వ్యవస్థలైన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా నాలుగవ స్తంభంగా పిలువబడుతూ రాజ్యాంగబద్ద మైన ఆ మూడు వ్యవస్థలకు ప్రజలకు మధ్య వారధిగా మారింది.

నిబద్ధత కలిగిన వ్యవస్థలుగా పని చేయాల్సిన ఈ నాలుగు విభాగాలు ఇప్పుడు ఆధిపత్యపోరుతో కొట్టుకుంటు న్నాయి. మేమే గొప్ప అనే నైజంతో ఎవరికివారే తమను తాము మోనార్కు లుగా ప్రకటించుకుని తమకు తాము బ్రష్టుపట్టిపోవడమే కాకుండా సమాజాన్ని పెడమార్గం పట్టిస్తున్నారు.

మొదటిగా తీసుకుంటే రాజకీయ వ్యవస్థ... ఇప్పుడా వ్యవస్థ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. తాము చెప్పిందే వేదం చేసిందే శాసనమన్న రీతిలో వ్యవహ రిస్తూ అధికార యంత్రాంగాన్ని శాసి స్తోంది. కొన్ని సందర్భాలలో చట్టాలను మార్చయినా సరే తాము అనుకున్నదే జరగాలన్న మొండి పట్టుదలతో వ్యవహ రిస్తోంది. అత్యంత మెజారిటీతో తమకు ప్రజలు పట్టం పట్టారు కాబట్టి తాము చేసిందే చట్టం అన్నది వారి భావన. ఈ పోకడ దాదాపుగా ఇప్పుడు భారతదేశం లోని అన్ని రాజకీయపార్టీలూ అవలంభి స్తున్నాయి. ప్రజల చేత ఎన్నికకాబడి తాము ప్రభు త్వాన్ని ఏర్పాటు చేశాము కాబట్టి సర్వ హక్కులూ తమవే అన్న ధీమా వారిది. ఇక్కడ వారి ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తే ఆ అధికారి ఎంతటి వాడైనా... బదిలీ వేటు తప్పదు.

ఇక రెండవది అధికార వ్యవస్థ... మొదటి వ్యవస్థకన్నా మాది శక్తివంతమైన వ్యవస్థ అన్నది వీరి అభిప్రాయం. రాజకీయ నాయకులు 5 లేదా 10 సంవత్సరాలు అధికారంలో వుంటారు, కానీ తాము రిటైర్ అయ్యేవరకూ ప్రభుత్వం వేదికగా ప్రజల కోసం పనిచేయాలికాబట్టి వాళ్ళు చెప్పిం దల్లా మేమెందుకు చెయ్యాలన్నది వీరి ప్రశ్న. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అది సమర్ధవంతంగా అమలు చేయా ల్సింది తామే కాబట్టి తమ సహకారం లేకపోతే అది ఏ పార్టీ అయినా మళ్ళీ ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడం అసాధ్య మన్నది కూడా వీరి గట్టి నమ్మకం. అందు చేతనే ప్రభుత్వం చేసే అన్ని ఆలోచనలకు గంగిరెద్దులా తల ఊపి తమ భవిష్యత్తును తాకట్టు పెట్టలేమంటారు కొందరు అధికా రులు. ఈ క్రమంలో ఒక్కోసారి ముఖ్య మంత్రి ఆదేశాలను కూడా కొందరు అధికా రులు పట్టించుకోవడంలేదు. తమకు భవి ష్యత్తులో ఇబ్బందులు వస్తాయనుకున్న పనులు చేయడానికి వారు ససేమిరా అంటున్నారు. మరికొంతమంది తమ ముక్కుసూటి మనస్తత్వంతోనో, లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసమో ప్రభుత్వ ధిక్కారానికి పాల్పడుతున్నారు. ఇక్కడ తామే గొప్ప అన్న సందేశాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

పై రెండు వ్యవస్థల వ్యవహార శైలిని, వారి మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరును జాగ్రత్తగా గమనిస్తున్న మూడవ వ్యవస్థ న్యాయవ్యవస్థ, ఆ రెండు విభాగాలను సమన్వయపరచి ప్రజలకు వాళ్ళని చేరువ చేసే ప్రయత్నం చెయ్యక పోగా, ఇక్కడ వాళ్ళిద్దరి తగువును ఆసరాగా చేసుకుని తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వ విధానాలను తప్పు పడుతోంది, అధికారులకు చివాట్లు పెడు తోంది, ప్రభుత్వానికి అధికారులకి మధ్య రాజుకున్న మంటను మరింత పెద్దది చేసే ప్రయత్నం చేస్తోంది. ఇక్కడ వారి స్వార్థం వారిది, నిర్ణయాలు చేసేది ఎవరైనా, వాటిని అమలు చెయ్యాల్సింది ఎవరైనా అంతిమంగా ఒక్క "స్టే" ద్వారా వాటన్నిటికీ బ్రేకులు వెయ్యగలిగే సర్వాధికారం తమకుందన్నది వారి ఆలోచన. తమ ఆధిపత్యాన్ని తాము ప్రదర్శించుకోవడంలో ఒక్కోసారి ప్రజాప్రయోజనాలు కూడా వాళ్ళు పక్కన పెడుతున్నారన్నది మేధావుల అభిప్రాయం.

ఇక చివరిగా మీడియా, ఇప్పుడు మీడియాకి స్వప్రయోజనాలే తప్ప ప్రజా ప్రయోజనాలతో పని లేదు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా యాజమాన్యాలు రెండూ ఎవరెవరి స్వార్థ ప్రయోజనాల కోసం, వారి వారి వ్యక్తిగత ప్రాముఖ్యతల కోసం తమ ప్రచార సాధనాలను వేదిక లుగా మార్చేశాయి. అనేక రాజకీయ పార్టీలు సైతం తమ పార్టీ భజనకోసం పార్టీ ప్రచారం కోసం సొంత పత్రికలను, చానళ్లను ప్రారంభించేశాయి. ఒకప్పుడు ఏదైనా పత్రికలో తమకు వ్యతిరేకంగా వార్త ప్రచురితమైనా, లేక ప్రచురితమవుతోందని తెలిసినా, అదే విధంగా ఛానల్లో వార్త ప్రసారమైనా, ప్రసారమవుతుందని తెలి సినా, మంత్రి హోదాలో ఉన్న రాజకీయ నాయకుడు కానీ, పెద్దస్థాయిలో ఉన్న అధికారి కానీ కంగారు పడేవాళ్ళు, వచ్చిన వార్తకు వివరణ ఇచ్చుకోవడమో, లేక రాబోతుందన్న వార్తను నిలుపు చేయించు కునే ప్రయత్నమో చేసేవాళ్ళు, ఇప్పుడా పరిస్థితిలేదు, వార్త రాస్తే బెదిరిస్తున్నారు, రాబోతుందని తెలిస్తే వార్నింగ్ ఇస్తున్నారు. అటు రాజకీయ నాయకుడు, ఇటు ప్రభుత్వ అధికారి ఇద్దరూ ఇప్పుడు మీడియాను ఏ మాత్రం ఖాతరు చేయడంలేదు. ఇందుకు కారణం మీడియా చెడిపోవడమే. మొదటి వ్యవస్థ ఒక శాసనం చేసినా, రెండవ వ్యవస్థ ఆ శాసనాన్ని అమలుచేసినా చెయ్యక పోయినా, మూడవ వ్యవస్థ అందుకు స్టే విధించినా, ఇవన్నీ ప్రజలకు తెలియ జేయాల్సింది మనమే కదా అన్నది వీరి గర్వం. పై మూడు విభాగాలకంటే తమ సాధనమే శక్తివంతమైందన్నది వీరి తలబిరుసు.

అయితే మీడియా విషయంలో ఇప్పుడు కొంచం పరిస్థితి మారింది. పాత మీడియా రోతగా మారడంతో డిజిటల్ మీడియా వేదికగా వేలాది సామాజిక మాధ్యమాలు పుట్టుకొచ్చాయి, ప్రస్తుతం సమాజంలో ఉన్న అన్ని పాత మీడియాలకంటే ఒక అడుగు ముందే ఉంటూ తమ ఉనికిని చాటుకుంటున్నాయి. విమర్శలను సంధిం చడంలో కూడా బరితెగించి వ్యవహరిస్తు న్నాయి. పత్రికలకు, చానళ్లకు ఉన్నట్లుగా వీటికి ఎలాంటి నియంత్రణా లేకపోవ డంతో తమ ఇష్టానుసారం రెచ్చిపోతు న్నాయి. సోషల్ మీడియా ధాటికి పేపర్లు, చానళ్ల తమ ఉనికిని కోల్పోతున్నాయన దానికి కూడా సందేహం అవసరం లేదు.

దేశ అభ్యున్నతికి పునాదులైన ఈ నాలుగు రంగాల వారి మధ్య సరైన అవ గాహన, సమన్వయం లోపిస్తుండడం వల్లనే దేశంలో రకరకాల అసమానతలు, సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే ఆవేదన సామాన్య ప్రజల్లో ఉంది.

ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా పరి శీలిస్తే... మూల స్థంబాలలాగా నిలబడి సమాజాన్ని ముందుకు నడిపించాల్సిన పై నాలుగు విభాగాలు ఎవరికి వారు తామే గొప్ప అన్న రీతిలో ఆధిపత్య పోకడతో వ్యవహరిస్తుంటే, సంస్కృతీ సంప్రదాయాల నిలయమై అభివృద్ధి బాటలో ప్రయాణిం చాల్సిన మన భారతదేశ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారి, ప్రశ్నార్థకమవు తుందేమోనన్నది సామాన్యుడి అనుమానం, ఆవేదన...!

# ఢిల్లీ వెళ్లొచ్చిన సీఎం


ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 22, 23తారీఖులలో ఆకస్మిక ఢిల్లీ పర్యటన చేసొచ్చాడు. కోర్టుల మితిమీరిన జోక్యంతో వాయిదాపడుతున్న ఇళ్లస్థలాల పంపిణీ, మూడురాజధానులతో పాలనా వికేంద్రీకరణ, రాజధాని భూకుంభకోణాల దర్యాప్తు వంటి అంశాలతో పాటు ఇంకా అనేక కీలక పరిణామాలు రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తరుణంలో సీఎం ఆకస్మిక ఢిల్లీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

మంగళవారం ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిశాడు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా గురించి మళ్ళీ గుర్తు చేశా డని, రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని విధా లుగా సహకరించాలని, తమకు రావలసిన నిధులను సాధ్యమైనంత త్వరగా విడుద లయ్యేలా చూడాలని హోంమంత్రిని కోరి నట్లు వార్త. పనిలో పనిగా రాష్ట్రంలో కోర్టుల వ్యవహారాన్ని కూడా అమిత్‌షా దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది.

ఇక బుధవారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ని కూడా జగన్ కలుసుకున్నాడు. పోలవరంకు సంబంధించిన పెండింగ్ నిధులను మంజూరు చేయడంతో పాటు సవరించిన అంచనాలకు కూడా ఆమోదం తెలపాలని కోరినట్లు సమాచారం. రాష్ట్రానికి సంబం ధించిన ఇతర ప్రాజెక్టులు తదితర అంశా లపైనా జగన్ కేంద్రమంత్రితో సుదీర్ఘ చర్చలు జరిపి వినతిపత్రం ఇచ్చి వచ్చాడని అంటున్నారు.

అయితే రాష్ట్రంలో ప్రతిపక్షాల కుట్రతో జరుగుతున్న అనేక కీలక పరిణామాలను హోంమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆశీస్సులు కోరివచ్చాడని, అంతా సవ్యంగా ఉందనుకుంటున్న తరుణంలో మంత్రి కొడాలి నేరుగా ప్రధానమంత్రిపైనే విమ ర్శలుచేసి ముఖ్యమంత్రిని ఇరకాటంలో పెట్టాడని, ఇలాంటి సమయంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలని వైసిపి శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. మొత్తానికి ముఖ్యమంత్రి రెండురోజుల ఢిల్లీ పర్యటన ఆశాజనకం గానే జరిగింది. ఫలితాలు ఎలా వుం టాయో ఎదురు చూడాల్సిందే మరి.

# అన్నదాతల కష్టాలు తీరుస్తున్న.. మన వెంకయ్య



**అసలే కరోనా కష్టకాలం. మరోవైపు ఆరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్న జిల్లా రైతాంగం. ఈ మధ్యలో మళ్లీ వర్షాలొచ్చి పండిన ధాన్యాన్ని తడిపేస్తుండడంతో అన్నదాతలకు మళ్లీ అదనపు కష్టాలు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్నదాతల దుస్థితిని గమనిస్తున్న భారత ఉప రాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు సరైన సమయానికి రైతుల కష్టాలను తీర్చేందుకు కేంద్రంలోని ఆయా మంత్రిత్వశాఖల వారితో సంప్రదింపులు జరిపి అన్నదాతలను ఆదుకుంటుండడం జిల్లాలోని రైతులకే కాక రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి ఎంతో సంతోషం కలిగిస్తోంది.**

నెల్లూరు జిల్లాలో పండిన ఎడగారు పంటకు సంబంధించిన ధాన్యాన్ని ఇతర జిల్లాల ఆహారపు అవసరాలకు రవాణా చేసేందుకు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కృషిచేస్తున్న ఫలితంగా కేంద్రప్రభుత్వం ఆ మేరకు అనుమతులిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేయడం జిల్లా రైతాంగంలో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా వాతావరణ పరిస్థితులు, రైతుల విజ్ఞప్తులతో ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ లేఖ ఆధారంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవ తీసుకుని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ కార్యదర్శితో, వ్యవసాయ శాఖ కార్యదర్శితో పాటు హోంశాఖ కార్యదర్శులతో మాట్లాడారు. ఫలితంగా తొలుత ఆగస్టు 31గా ఉన్న రబీ పంట ధాన్యం సేకరణ గడువు నెల్లూరు జిల్లాలో గతంలో సెప్టెంబర్ 31కి, గత వారంలో అక్టోబర్ 31కి పెంచుతూ కేంద్ర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. అదనంగా సేకరించిన ధాన్యాన్ని నెల్లూరు ఇరుగుపొరుగు జిల్లాల అవసరాలకు పంపిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఉపరాష్ట్రపతి సూచించడంతో ఈ విషయాన్ని త్వరలోనే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సూచిస్తామని కేంద్ర ఆహార ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ కార్యదర్శి గతంలో తెలియజేసివున్నారు. దీనికి సంబంధించి తాజాగా ఇప్పుడు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సేకరించిన మొత్తం ముడి ధాన్యం నుంచి నెల్లూరు జిల్లాతో పాటు గుంటూరు, ప్రకాశం, తూర్పు గోదావరి, కడప జిల్లాలకు రవాణా చేసేందుకు అనుమతులు ఇస్తూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులిచ్చింది.

## అక్టోబర్ 31 దాకా మిల్లర్ల నుంచి బియ్యం సేకరించేందుకు ఉత్తర్వులు

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో కేంద్ర ఆహార ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ మిల్లర్ల నుంచి కూడా అక్టోబర్ 31 వరకు బియ్యాన్ని సేకరించేందుకు అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే నెల్లూరు జిల్లాలోని ఎడగారు పంటను అక్టోబర్ 31 వరకు సేకరించేదుకు ఆ శాఖ అంగీకరించివుంది కూడా. అయితే మిల్లర్ల నుంచి బియ్యాన్ని సేకరించే విషయంలో పలు అనుమానాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మిల్లర్ల నుంచి ఆ బియ్యాన్ని సేకరించే గడువును పెంచాల్సిందిగా కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. ఆ శాఖ కార్యదర్శితో ఉపరాష్ట్రపతి మాట్లాడడం, మిల్లర్లకు స్పష్టత ఇవ్వడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. దీంతో ఆ శాఖ మిల్లర్ల నుంచి అక్టోబర్ 31 దాకా బియ్యాన్ని సేకరించేందుకు అంగీకరిస్తూ ఉత్తర్వులివ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది మిల్లర్లకు ప్రయోజనం కలుగనుంది. ఇప్పటికే కరోనా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రైతులను ఆదుకునేందుకు నిరంతరం కృషి చేస్తుండడం వల్ల తమకెంతో సహాయం చేసినట్లవుతోందని రైతులు, మిల్లర్లు ఉపరాష్ట్రపతి మన వెంకయ్యకు సంతోషంగా కృతజ్ఞతలు చెప్తున్నారు.

# సోమశిల 'జలకళ' ఆనందదాయకం - ఉపరాష్ట్రపతి వెంకయ్య



నెల్లూరు జిల్లా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా సోమశిల జలాశయం పూర్తిస్థాయిలో జలకళ సంతరించుకోవడం ఎంతో ఆనందదాయకమని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి నుంచి వ్యక్తిగతంగా ఆ ప్రాజెక్టు పురోగతిని తాను పరిశీలిస్తూ వచ్చాని, ఆ తర్వాత ఆ పురోగతిలో భాగస్వామినవడమే కాక, దాని అభివృద్ధికి సహకారాన్ని కూడా అందించానని, అందుకే సోమశిల ప్రాజెక్టు నిండడం తనకు ఎంతో సంతోషం కలిగిస్తోందని ఆయన తెలిపారు. మొత్తం 78 టిఎంసిల సామర్థ్యంతో 5,84,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిండి, ఎగువనుంచి వస్తున్న నీటి ద్వారా జలాశయం నిండడం, అన్ని తూములు ఎత్తివేసి నీరు క్రిందకు ధారాళంగా ప్రవహించడం, అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఉపయోగపడే అవకాశాలు పెరగడం సంతోషదాయకమన్నారు. ఉదయగిరి నియోజకవర్గానికి తాగునీరు, సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన సోమశిల హైలెవల్ కాలువ నిర్మాణ పనుల గురించి ఈ మధ్యే సంబంధిత మంత్రిత్వ శాఖలవారితో మాట్లాడి ఆ పనులు వేగవంతం చేయాలని సూచించానని, ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి లేఖ కూడా రాశానని, ఈ పనులు త్వరితగతిన పూర్తయ్యి భవిష్యత్తులో ఈ ప్రయోజనాలు అక్కడి ప్రజలకు అందాలనేదే తన అభిలాష అని పేర్కొన్నారు. సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల జలాల ద్వారా ఆత్మకూరు, కావలి మెట్ట ప్రాంతాలు, నెల్లూరు బ్యారేజీ, సంగం ఆనకట్ట, నెల్లూరు చెరువు, సర్వేపల్లి చెరువు, కలిగిరి రిజర్వాయరు, అనంతసాగరం చెరువు నిండి ఇవన్నీ పూర్తి జలకళను సంతరించుకుని రైతులకు సంతోషాన్ని కలిగించాలని తాను ఆకాంక్షిస్తున్నానన్నారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com

is now

**www.lawyerpatrika.com**

వీక్షణం

- మంజీర

## రావడం వరకు సరే..!

# తర్వాత ఏంటి?

వి.కె.శశికళ వచ్చే ఏడాది జనవరిలో విడుదలయ్యే అవకాశం ఉంది. పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న శశికళ వచ్చే ఏడాది జనవరి 27వ తేదీన విడుదల కావచ్చని నరసింహమూర్తి అనే న్యాయవాదికి రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్టు నుంచి అందిన సమాచారం. కోర్టు విధించిన పదికోట్ల జరిమానా చెల్లించడం శశికళకు పెద్ద విషయం కాదు, కాబట్టి ఆమె వచ్చే ఏడాది జనవరిలో బయటకు వస్తారనే అనుకోవాలి. జరిమానా కట్టకపోతే మరో ఏడాది జైల్లో ఉండాలన్నమాట. వచ్చే ఏడాది మధ్యలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలున్నాయి. జయలలితకు అసలైన వారసురాలిని నేనేనంటూ శశికళ సమరశంఖం పూరించడానికి సిద్ధమవుతుందా? తాను ఆవేశంలో స్థాపించిన 'అమ్మ మక్కళ్ మున్నేట్ర కగజమ్' పార్టీని, అధ్యక్షురాలి హోదాలో సంస్థాగతంగా నిర్మించడం ఆమెకు సాధ్యమయ్యే పనేనా? సమరశంఖం పూరించాలనే ఆకాంక్ష అయితే ఆమెకు ఉండవచ్చు కానీ, పూరించే అవకాశం ఏ మాత్రం కనిపించడం లేదు.

## ఆరేళ్ల నిషేధం

జైలు శిక్ష అనుభవించిన వాళ్లు ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయరాదు. ఈ నిబంధనం ప్రకారం శశికళ రాబోయే ఏడాది ఎన్నికల్లో పోటీ చేయలేరు. అలాగే ఆ తర్వాత ఐదేళ్లకు వచ్చే 2026 ఎన్నికల్లోనూ పోటీ చేయలేరు. ఇక ఆమె స్వయంగా రంగంలో దిగగలిగిన ఎన్నికలు 2031 ఎన్నికలే. అయితే ఇప్పుడామె వయసు 69. మరో పదకొండేళ్లకు ఎనభై నిండుతాయి. ఆ వయసులో ముఖ్యమంత్రి రేస్‌లో నిలవగలరా? సందేహమే.

## ఆకుల చీలిక

ఏఐఏడిఎమ్‌కేలో పళనిస్వామి, పన్నీర్ సెల్వంలు రాబోయే ఎన్నికలకే రెండాకులను చీల్చి చెరొక ఆకు పట్టుకునేటట్లు ఉన్నారు. గత నెలలో (ఆగస్టు) 'కాబోయే ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం' అంటూ థేని జిల్లాలో రాత్రికి రాత్రి పోస్టర్స్ వెలిశాయి. పార్టీ పెద్దలు 'ఇది ఎవరి పనో తెలియదు' అని నీళ్లు నములుతున్నారు. కానీ జనం మాత్రం 'అప్ప అంటే ఎవరనుకున్నారు? అమ్మ (జయలలిత) ఎంపిక చేసిన వ్యక్తి... ఆయనకు కాక మరెవరికి ఓటేస్తాం' అంటున్నారు. ఇంత స్థాయిలో కాకపోయినా పళని స్వామి ముఖ్యమంత్రి కావాలని కోరుకునే వాళ్లు కూడా ఉన్నారు. ఇది ఇలా ఉంటే 'శశికళ జైలు నుంచి విడుదల అయిన తర్వాత తిరిగి పార్టీలో చేర్చుకుంటారా' అనే ప్రశ్నలకు ఏఐఏడిఎంకె నాయకుల నుంచి పుల్ల విరుపు సమాధానాలే వస్తున్నాయి. 'ఆమెకు-పార్టీకి ఎటువంటి సంబంధం లేదు. తాను చక్కదిద్దుకోవాల్సిన సొంత సమస్యలు ఆమెకు చాలానే ఉన్నాయి' అనేశాడు పార్టీ డిప్యూటీ కో ఆర్డినేటర్ కేపీ మునుస్వామి.

## పరిణతిలోపమే

శశికళ వైపు నుంచి ఆలోచిస్తే... ముఖ్యమంత్రి పదవిని ఆశించకుండా, వర్గాలను సమీకరించకుండా, మన్నార్ గుడి బృంద పరిరక్షణే పరమావధిగా పెట్టుకోకుండా, తాను ఆవేశంలో స్థాపించిన పార్టీని పక్కన పెట్టి, ఏఐఏడిఎంకే పార్టీని ఒకతాటి మీద నడిపించడానికి పెద్దమ్మ పాత్ర వహించగలరా? కింగ్‌మేకర్‌గా మారి పార్టీ శ్రేణులకు 'నేనున్నాను' అనే భరోసా కల్పించగలుగుతారా? 'మనమంతా పురచ్చి తలైవి అనుచరులం' అని అందరినీ ఎన్నికల రణంలోకి దించగలుగుతారా? అంత పరిణతి ఆమెలో ఉండి ఉంటే... సీఎం పీఠం కోసం పనీర్ సెల్వం చేత రాజీనామా చేయించడం వంటి తొందరపాటుకు తావుండేది కాదు. అది కూడా రాష్ట్రం జయలలిత జ్ఞాపకాలు, విషాదం నుంచి తేరుకునేలోపే జరగడం శోచనీయమే.

## చిన్నమ్మ బహిష్కరణ

2016, డిసెంబర్ ఐదవ తేదీన జయలలిత మరణం, అదే నెల 29న పార్టీ సమావేశమై శశికళను జనరల్ సెక్రటరీగా ఎన్నుకోవడం, నలభై రోజులలోపే (2017, ఫిబ్రవరి5) పార్టీ శాసనసభాపక్షం సమావేశమై తమ నేతగా శశికళను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, మరుసటి రోజే పనీర్ సెల్వం చేత రాజీనామా చేయించడం, తనకు ఎమ్మెల్యేల మద్దతు ఉందని గవర్నర్‌కు వినతి పత్ర సమర్పణ... అన్నీ చకచకా జరిగిపోయాయి. పనీర్ సెల్వం రాజీనామాకు ఆమోదించినంత వేగంగా శశికళను సీఎంగా ప్రకటించే సాహసం చేయలేదు గవర్నర్ విద్యాసాగర్ రావు. ఆ సాచివేత వెనుకనున్న వ్యూహం శశికళ కేసుల రూపంలో పడగ విప్పింది. ఫిబ్రవరి 14వతేదీన దోషిగా నిరూపణ, నాలుగేళ్లు జైలు శిక్ష ఖరారయిపోయాయి. అదే ఏడాది ఆగస్టు21న సమావేశమైన నాయకులు శశికళను పార్టీ జనరల్ సెక్రటరీ పదవి నుంచి తప్పించడంతోపాటు, ఏఐఏడిఎంకే పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేసి పార్టీ నుంచి బహిష్కరిస్తూ తీర్మానం చేశారు.

## భవిష్యత్తు భద్రమేనా?

శశికళకు భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే కేంద్రంలో ఏదో ఒక పార్టీ ఊతం కావాల్సిందే. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి తీరాల్సిందే. కాంగ్రెస్‌ను నమ్ముకునే పరిస్థితి కనిపించడం లేదు. తన 'ముఖ్యమంత్రి' కలను కాలరాసి, తన రాజకీయ జీవితానికి ఇన్ని ప్రశ్నలను మిగిల్చిన బీజేపీతో అంటకాగడం ఆమెకు సాధ్యమయ్యే పని కాదు. ఇక మన రాష్ట్రంలో అయితే కాంగ్రెస్ పార్టీ అంపశయ్య మీదకు చేరిన తర్వాత చాలామంది నాయకులు తెరమరుగయ్యారు. రఘువీరారెడ్డి వంటి సీనియర్ నాయకుడు ట్రాక్టర్‌తో పొలం దున్నుతూ రాజకీయ వానప్రస్థంలో శేష జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతున్నాడు. అలాగే శశికళ కూడా జయలలితతోపాటు తన వైభవాలన్నీ ముగిశాయని సరిపెట్టుకుని వానప్రస్థం స్వీకరించాలంటే... అది ఆమెకు కుదిరే పని కాదు. ప్రతీకార రాజకీయాలకు పెట్టింది పేరైన తమిళనాడులో నాయకులకు వానప్రస్థం అనే మాట సింహస్వప్నమే. చివరి ఘడియలు కూడా రాజకీయరంగంలోనే గడిపి తుదిశ్వాస కూడా రాజకీయాలతో కలిపి వదలాల్సిందే. జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత శశికళకు... విశాల ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లు, స్వేచ్ఛా విహంగంగా భావించి హాయిగా ఊపిరి పీల్చుకునే పరిస్థితి మాత్రం ఉండకపోవచ్చు.

# చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌కు లైన్ క్లియర్

## త్వరితగతిన భూ సేకరణకు కరికాల వలవన్ ఆదేశాలు

ఎప్పటినుంచో ప్రకటనలకే పరిమితమైన చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పనులకు ప్రభుత్వం ఇప్పుడు లైన్‌క్లియర్ చేసింది. ఈనెల 22న రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి, ఏపిఐఐసి వైస్‌ఛైర్మెన్ మరియు ఎం.డి కరికాల వలవన్ జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి భూమిని ఏపిఐఐసికి అందజేయాలని ఆదేశించారు. తదుపరి దీనికి సంబంధించి కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించి నిధుల మంజూరు అనంతరం పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ భూసేకరణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేస్తామన్నారు.

మొత్తానికి ఎన్నాళ్ళగానో ఎదురు చూస్తున్న చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ త్వరలో కార్యరూపం దాల్చడం జిల్లాల పునర్విభజన తరుణంలో గుడ్డిలో మెల్లలా జిల్లాకి శుభవార్తే!

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు










ద్వితీయ వర్ధంతి

మా తండ్రి గారైన

కీ॥శే॥ మెట్టుకూరు చినపిచ్చిరెడ్డి గారు

మమ్ము వీడి దైవసన్నిధికి చేరి తేది.26.09.20 శనివారం నాటికి

రెండేళ్ళు గడవనున్న సందర్భంలో ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

భార్య : శ్రీమతి అమ్మణ్ణమ్మ

కుమారులు - కోడళ్ళు

మెట్టుకూరు ధనంజయరెడ్డి - సంపూర్ణమ్మ

మాజీ ఛైర్మెన్, నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు

మెట్టుకూరు విజయభాస్కర్‌రెడ్డి - పద్మలత

కుమార్తె : బోయిళ్ళ మైథిలి

మనుమలు - మనుమరాళ్ళు

కోడూరు రామకృష్ణారెడ్డి - నాగజ్యోతి

డాక్టర్ గోపీనాథ్‌రెడ్డి - డాక్టర్ అనీష

మరియు మునిమనుమలు, మునిమనుమరాళ్ళు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com